

నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.



Contact Number 9059328777



రంగారెడ్డి బుధవారం 26-08-2026 సంపుటి: 02 సంచిక : 116 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Wednesday, 26-08-2026 Volume :02 Issue: 116 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani


## విస్తరణ దిశగా కాక్రోచ్ పార్టీ!

- కొత్త సభ్యులను ప్రకటించిన సీజేపీ
- దేశవ్యాప్తంగా సంస్థాగత బలోపేతానికి సీజేపీ కొత్త అడుగులు
- ఉత్తర, తూర్పు, పశ్చిమ జోన్లకు ప్రత్యేక సమన్వయ కమిటీలు
- రాష్ట్రాల వారీగా ఇన్‌ఛార్జ్లు, జాతీయ స్థాయి బాధ్యుల నియామకం
- యువత, విద్యార్థులు, ఉద్యోగార్థులను ఏకం చేయడమే లక్ష్యం: అభిజీత్ దీప్కే
- గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు బలమైన పార్టీ నిర్మాణం
- సెప్టెంబర్ నుంచి 'క్యా బోల్తీ పబ్లిక్' కార్యక్రమానికి శ్రీకారం
- ప్రజల సమస్యల ఆధారంగా ప్రజా కేంద్రిత కార్యాచరణ రూపొందించనున్న సీజేపీ

02

దేశవ్యాప్తంగా సంస్థాగత బలోపేతానికి సీజేపీ మరో కీలక అడుగు వేసింది. కొత్త సభ్యులను ప్రకటించడంతో పాటు పలు రాష్ట్రాలు, జోన్లకు సంస్థాగత బృందాలను నియమించింది. యువత, విద్యార్థులు, ఉద్యోగార్థులు, సామాన్య ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే లక్ష్యంతో పార్టీ విస్తరణ కార్యక్రమాలను వేగవంతం చేస్తోందని వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. సెప్టెంబర్ నుంచి 'క్యా బోల్తీ పబ్లిక్' పేరుతో దేశవ్యాప్త ప్రజా సంభాషణ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజా సమస్యల ఆధారంగా కార్యాచరణ రూపొందించనున్నట్లు వెల్లడించారు.




## మూసీ ప్రాజెక్టు భూసేకరణకు
# వేగం పెంచాలి

**ల్యాండ్ పూలింగ్‌పై స్పష్టమైన విధానం రూపొందించాలన్న రేవంత్**

- ఫేజ్-2 పనులకు త్వరలోనే టెండర్లు పిలవాలని సూచన
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూముల సేకరణలో న్యాయపరమైన జాగ్రత్తలు
- మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టులకు తక్కువ వడ్డీ రుణాలపై దృష్టి
- ఓంకారేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి వెంటనే టెండర్ల పిలుపు
- కొత్వాల్‌గూడ బర్డ్స్ పార్క్‌కు విస్తృత ప్రచారం కల్పించాలని సూచన
- ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహణ

హైదరాబాద్

హైదరాబాద్ నగర అభివృద్ధిలో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు అమలుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణలో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు ల్యాండ్ పూలింగ్‌కు సంబంధించి స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని సూచించారు. ప్రాజెక్టు అమలులో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుపై ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో సీఎం

-మిగతా 2 లో





## తెలంగాణలో విస్తారంగా వర్షాలు

- నిండుతున్న ప్రాజెక్టులు
- జలకళను సంతరించుకుంటున్న పలు ప్రాజెక్టులు
- వరద నీటితో సింగరేణి గనుల్లో నిలిచిన బొగ్గు ఉత్పత్తి
- రాష్ట్రంలో మరో నాలుగు రోజుల పాటు వర్షాలు
- మెదక్ జిల్లాలో అత్యధికంగా 11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు

హైదరాబాద్

అల్పపీడన ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా గత రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతుండగా, పలు ప్రాజెక్టులకు జలకళ వచ్చింది. ఎండిపోతున్న పంటలకు జీవం పోసిన ఈ వర్షాలు రైతుల్లో ఆనందాన్ని నింపుతున్నాయి. మరోవైపు, భారీ వర్షాల కారణంగా సింగరేణి గనుల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. గడిచిన 24 గంటల్లో మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలో అత్యధికంగా 11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సంగారెడ్డి, వికారాబాద్, కామారెడ్డి, నారాయణపేట, మహబూబ్ నగర్ జిల్లాల్లోనూ పలుచోట్ల భారీ

-మిగతా 2 లో




02

## దేశంలో విజృంభిస్తున్న H1N1 వైరస్..

- దేశంలోని పలు రాష్ట్రాల్లో పెరుగుతున్న హెచ్1ఎన్1 కేసులు
- ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్నది కొత్త వైరస్ కాదన్న ఐసీఎంఆర్
- 2009 మహమ్మారికి కారణమైన అదే వైరస్ ఇప్పటికీ కొనసాగింపు
- ఎక్కువ కేసుల్లో స్వల్ప లక్షణాలే.. భయపడాల్సిన అవసరం లేదన్న నిపుణులు
- దేశవ్యాప్తంగా సెంటినెల్ నిఘా వ్యవస్థతో నిరంతర పర్యవేక్షణ
- హెచ్1ఎన్1తో పాటు ఇతర శ్వాసకోశ వైరస్‌లపై కూడా నిఘా
- వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి
- మాస్క్, చేతుల పరిశుభ్రత, విశ్రాంతితో ఫ్లూపై నియంత్రణ సాధ్యం

## హిజాబ్ తప్పనిసరి కాదు

- అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పు
- విద్యాసంస్థల డ్రెస్ కోడ్‌కు విద్యార్థులు కట్టుబడి ఉండాల్సిందే
- యూనిఫామ్‌తో పాటు హిజాబ్‌కు అనుమతి కోరిన పిటిషన్ కొట్టివేత
- వ్యక్తిగత అభిరుచుల మేరకు యూనిఫామ్ మార్పులకు అవకాశం లేదన్న ధర్మాసనం
- క్రమశిక్షణ, సమానత్వం కోసం డ్రెస్ కోడ్ అమలు సమర్థనీయం
- వివక్షారహిత నిబంధనలను అమలు చేసే అధికారం విద్యాసంస్థలకే
- హిజాబ్‌పై గత తీర్పులను ప్రస్తావించిన అలహాబాద్ హైకోర్టు

02





## అందుబాటులోకి స్వదేశీ ఏకే-47

- పూర్తి స్వదేశీ విడిభాగాలతో తొలి ఏకే-203 రైఫిల్ విజయవంతం
- అమేథీ కోర్వా కేంద్రంలో తయారైన భారతీయ ఏకే-203
- బర్స్ట్ ఫైరింగ్ సహా ప్రారంభ పరీక్షల్లో ఉత్తీర్ణత
- లైసెన్స్ అసెంబ్లీ నుంచి పూర్తి స్వదేశీ తయారీ దశకు భారత్
- సెప్టెంబర్‌లో సైన్యం విస్తృత స్థాయి ఫీల్డ్ ట్రయల్స్
- 6 లక్షలకు పైగా రైఫిళ్ల సరఫరాకు లక్ష్యంగా ఇండో-రష్యన్ రైఫిల్స్
- ప్రతి 100 సెకన్లకు ఒక రైఫిల్ తయారీ సామర్థ్యంపై దృష్టి
- మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్‌కు మరో కీలక మైలురాయి

02

రక్షణ రంగంలో ఆత్మనిర్భర భారత్‌కు మరో కీలక మైలురాయి చేరుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ జిల్లా కోర్వాలో పూర్తిగా స్వదేశీ విడిభాగాలు, ముడి పదార్థాలతో తయారైన తొలి ఏకే-203 అసాల్ట్ రైఫిల్ విజయవంతంగా పరీక్షలను పూర్తి చేసింది. ఈ విజయంతో లైసెన్స్ ఆధారిత అసెంబ్లీ దశను దాటి పూర్తి స్వదేశీ ఆయుధ తయారీ సామర్థ్యాన్ని భారత్ చాటుకుంది. భారత సైన్యంలో ఇన్సాస్ రైఫిళ్ల స్థానంలో ఏకే-203లను ప్రవేశపెట్టే ప్రక్రియకు ఇది కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

# హలో జర్నలిస్ట్..చలో ఢిల్లీ...

**సెప్టెంబర్ 15,16,17 న టి.యు.డబ్ల్యు.యు జంతర్ మంతర్ లో మహా ధర్నా..**

**“హలో జర్నలిస్ట్.... చలో ఢిల్లీ” గోడపత్రికను తన నివాసంలో ఆవిష్కరించిన మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్**

- తెలంగాణ యునైటెడ్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే)కు సంపూర్ణ సహకారం అందిస్తాం..
- యూనియన్ రాష్ట్ర కమిటీ ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించిన ఎంపీ ఈటల రాజేందర్

హైదరాబాద్ సిటీ బ్యూరో/మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా బ్యూరో, ఆగస్టు 25(నేటి దర్శిని): తెలంగాణ సకల జనుల ఆకాంక్షను నెరవేరుస్తూ పోరాడి సాధించుకున్న, తెలంగాణ ఉద్యమంలో మమేకమైనటువంటి తెలంగాణ జర్నలిస్టుల సమస్యలపై తాను పార్లమెంట్ లో చర్చించానని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పేర్కొన్నారు. మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అమీన్ పూర్ లోని తన నివాసంలో తెలంగాణ యునైటెడ్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర కమిటీ ప్రతినిధులు, తొలివార్త తెలుగు దినపత్రిక ఎడిటర్ లింగాల నరేందర్ గౌడ్, నేటి దర్శిని తెలుగు దినపత్రిక ఎడిటర్ కట్టా సత్యనారాయణ, వార్త వేకువ ఎడిటర్ అవనిగంటి అనిల్ కుమార్ ప్రతినిధులు మంగళవారం ఈటలను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ యునైటెడ్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే)




యూనియన్ ఆధ్వర్యంలో వచ్చే నెలలో 15, 16, 17 తేదీల్లో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరగనున్న హలో జర్నలిస్ట్.... చలో ఢిల్లీ కార్యక్రమ గోడ పత్రికను ఎంపీ ఈటెల రాజేందర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను యూనియన్ రాష్ట్ర కమిటీ పద్ధతులను

-మిగతా 4 లో



## ఏడాదిలోగా దేవాదుల పూర్తి

- బదిలీ చేసేందుకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆమోదం
- దేశీయ ఉత్పత్తి సామర్థ్యాల పెంపే కేంద్ర లక్ష్యం
- ప్రైవేట్ సంస్థల ఎంపికకు పోటీ వేలం నిర్వహణ
- అగ్ని సిరీస్ వ్యూహాత్మక మిస్సైళ్లకు మినహాయింపు
- అస్త్రా, ప్రళయ్ సహా పలు మిస్సైల్ టెక్నాలజీల బదిలీ
- తక్కువ వ్యయంతో భారీ ఉత్పత్తికి మార్గం సుగమం
- రక్షణ పారిశ్రామిక స్థావరాన్ని బలోపేతం చేసే చర్య
- ఎంఎస్ఎంఈలకు సప్లై చైన్‌లో కొత్త అవకాశాలు
- పరిశోధన దశ నుంచి పారిశ్రామిక ఉత్పత్తి దశకు వేగవంతమైన మార్పు

హైదరాబాద్

దేవాదుల ప్రాజెక్టును ఏడాదిలోగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించనున్నట్టు నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దనసరి అనసూయ సీతక్క తో కలిసి దేవాదుల పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణకు రూ. 6,000 కోట్లు కేటాయించామనీ, ఇప్పటి వరకు రూ. 2,500 కోట్లు విడుదలయ్యాయని మంత్రి వెల్లడించారు. దేవాదుల ప్రాజెక్టుకు కూడా ఇటీవల భూసేకరణ కోసం నిధులు విడుదల చేసినట్టు తెలిపారు. అవసరమైన ప్రక్రియలు పూర్తయిన వెంటనే మిగిలిన నిధులను సైతం సమకూరుస్తామని తెలిపారు. ఇకపై విధానపరమైన, పరిపాలనా లేదా కాంట్రాక్టు

-మిగతా 2 లో

WWW.NETIDARSHINI.COM
RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక
సత్య శోధనే మా లక్ష్యం



# విస్తరణ దిశగా కాక్రోచ్ పార్టీ!

**- కొత్త సభ్యులను ప్రకటించిన సీజేపీ**
**-దేశవ్యాప్తంగా సంస్థాగత బలోపేతానికి సీజేపీ కొత్త అడుగులు**
**-ఉత్తర, తూర్పు, పశ్చిమ జోన్లకు ప్రత్యేక సమన్వయ కమిటీలు**
**-రాష్ట్రాల వారీగా ఇన్‌ఛార్జ్లు, జాతీయ స్థాయి బాధ్యుల నియామకం**
**-సభ్యత్వ విస్తరణతో పాటు ప్రజా సమస్యలపై ఉద్యమాలకు ప్రాధాన్యం**
**-యువత, విద్యార్థులు, ఉద్యోగార్థులను ఏకం చేయడమే లక్ష్యం: అభిజీత్ దీప్కే**
**-గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు బలమైన పార్టీ నిర్మాణం**
**-సెప్టెంబర్ నుంచి 'క్యా బోల్తీ పబ్లిక్' కార్యక్రమానికి శ్రీకారం**
**-ప్రజల సమస్యల ఆధారంగా ప్రజా కేంద్రిత కార్యాచరణ రూపొందించనున్న సీజేపీ**




న్యూఢిల్లీ

దేశవ్యాప్తంగా సంస్థాగత బలోపేతానికి మరో కీలక అడుగు వేస్తూ సీజేపీ కొత్త సభ్యులను ప్రకటించడంతో పాటు వివిధ రాష్ట్రాలు, జోన్లకు సంబంధించిన సంస్థాగత బృందాలను ఆవిష్కరించింది. పార్టీ విస్తరణ, సమన్వయం, ప్రజా సమస్యలపై ఉద్యమాలను మరింత సమర్థంగా నిర్వహించేందుకు ఈ కొత్త నియామకాలు చేపట్టినట్లు పార్టీ వెల్లడించింది. దేశ వ్యాప్తంగా పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేయడానికి ఉత్తర, తూర్పు, పశ్చిమ జోన్లకు ప్రత్యేక కోఆర్డినేషన్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలు ఆయా ప్రాంతాల్లో సభ్యత్వ విస్తరణ, కార్యక్రమాల నిర్వహణ, రాష్ట్ర యూనిట్ల మధ్య సమన్వయ బాధ్యతలు నిర్వర్తించనున్నాయి. సంస్థాగత విస్తరణలో భాగంగా పలు రాష్ట్రాలకు కొత్త ఇన్‌ఛార్జ్లు, సమన్వయకర్తలు, జాతీయ స్థాయి బాధ్యులను నియమించింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో పార్టీ కార్యకలాపాలను విస్తరించడంతో పాటు స్థానిక సమస్యలను జాతీయ స్థాయికి తీసుకెళ్లేలా ఈ బృందాలు పనిచేయనున్నట్లు పార్టీ తెలిపింది. పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా యువత, విద్యార్థులు, ఉద్యోగార్థులు, సామాన్య ప్రజలను ఒకే వేదికపైకి తీసుకురావడమే తమ లక్ష్యమని అన్నారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలను పెంచుతూ గ్రామం నుంచి జాతీయ స్థాయి వరకు బలమైన సంస్థాగత నిర్మాణాన్ని ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సెప్టెంబర్ నుంచి దేశవ్యాప్తంగా క్యా బోల్తీ పబ్లిక్ పేరుతో ప్రజలతో ప్రత్యక్ష సంభాషణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ ప్రకటించింది. ఈ కార్యక్రమం ద్వారా యువత, విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి ఆధారంగా ప్రజా కేంద్రిత కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపింది.

# తెలంగాణలో విస్తారంగా వర్షాలు

మొదటి తరువాయి

వర్షాలు కురిసాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ వర్ష ప్రభావం ఎక్కువగా ఉంది. ఈ వర్షాలతో గోదావరి బేసిన్లోని ప్రాజెక్టులు నిండుతున్నాయి.
నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి మట్టానికి (1,405 అడుగులు) చేరువ కాగా, ప్రస్తుతం నీటిమట్టం 1,401 అడుగులకు చేరింది. శ్రీరామ్ సాగర్ జలాశయంలో నీటిమట్టం 44 టీఎంసీలు దాటింది. కొత్తగూడెం జిల్లాలోని తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరద వస్తుండటంతో 17 గేట్లు ఎత్తి 74,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజ్ కు వరద పోటెత్తడంతో 85 గేట్లు ఎత్తి నీటిని కిందికి వదులుతున్నారు. మరోవైపు, భారీ వర్షాల కారణంగా ఇల్లందు, మణుగూరులోని సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లోకి వరద నీరు చేరడంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. కాగా, రాష్ట్రంలో మరో నాలుగు రోజుల పాటు (ఆగస్టు 28 వరకు) తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు 26 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

# హిజాబ్ తప్పనిసరి కాదు

**-అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పు**
**-విద్యాసంస్థల డ్రెస్ కోడ్‌కు విద్యార్థులు కట్టుబడి ఉండాల్సిందే**
**-యూనిఫామ్‌తో పాటు హిజాబ్‌కు అనుమతి కోరిన పిటిషన్ కొట్టివేత**
**-వ్యక్తిగత అభిరుచుల మేరకు యూనిఫామ్ మార్పులకు అవకాశం లేదన్న ధర్మాసనం**
**-క్రమశిక్షణ, సమానత్వం కోసం డ్రెస్ కోడ్ అమలు సమర్థనీయం**
**-వివక్షారహిత నిబంధనలను అమలు చేసే అధికారం విద్యాసంస్థలకే**
**-హిజాబ్‌పై గత తీర్పులను ప్రస్తావించిన అలహాబాద్ హైకోర్టు**



, నేషనల్ బ్యూరో:
ఇస్లాంలో మహిళలు హిజాబ్ ధరించడం తప్పనిసరియైన మత ఆచారం కాదని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. విద్యా సంస్థలు నిర్ణయించిన డ్రెస్ కోడ్‌ను తమ వ్యక్తిగత ప్రాధాన్యతల ప్రకారం మార్చే హక్కు ఏ విద్యార్థికీ లేదని తేల్చిచెప్పింది. పాఠశాల యూనిఫామ్‌తోపాటు హిజాబ్ ధరించేందుకు అనుమతించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టి వేసింది. ప్రయాగ్‌రాజ్‌లోని ఒక ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసి, అదే పాఠశాలలో 11వ తరగతిలో చేరాలనుకుంటున్న ఒక మైనర్ విద్యార్థిని తరపున ఆమె తల్లి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. హిజాబ్ ధరించడం ఇస్లాం మత ఆచారంలో అత్యంత ముఖ్యమైన భాగమని, ఆరో తరగతి నుండి తాము ఇదే పాఠశాలలో హిజాబ్ ధరిస్తున్నామని పిటిషనర్ పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ జేజే మునీర్, జస్టిస్ ఇంద్రజిత్ శుక్లాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ కేసును విచారించి ఆగస్టు 21న తీర్పు వెలువరించింది. హిజాబ్ ధరించడం అనేది ఇస్లాం మతాచారంలో అత్యంత ముఖ్యమైన భాగం కాదని హైకోర్టు స్పష్టం చేసింది. హిజాబ్ ధరించకపోతే మత విశ్వాసానికి భంగం వాటిల్లుతుందనే వాదనను గతంలో వివిధ హైకోర్టులు కూడా తోసిపుచ్చాయని గుర్తుచేసింది. విద్యా సంస్థలలో క్రమశిక్షణ, సమానత్వాన్ని కాపాడేందుకు అమలు చేసే యూనిఫామ్ నిబంధనలు వివక్షారహితంగా ఉన్నంత కాలం, వాటిని అమలు చేసే పూర్తి అధికారం ఆయా సంస్థలకు ఉంటుందని కోర్టు తెలిపింది.

# మూసీ ప్రాజెక్టు భూసేకరణకు వేగం పెంచాలి

మొదటి తరువాయి

పలు కీలక అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పురోగతిని సమీక్షించిన ఆయన, మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు రెండో దశ (ఫేజ్-2) పనులకు వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని ఆదేశించారు. ప్రాజెక్టు అమలు వేగవంతం కావాలంటే భూసేకరణ, ఆర్థిక వనరుల సమీకరణ, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక అవసరమని పేర్కొన్నారు. భూసేకరణ ప్రక్రియలో ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లు, అసైన్డ్ భూముల సేకరణ వంటి సున్నితమైన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. ఈ అంశాలకు సంబంధించి స్పష్టమైన విధివిధానాలను రూపొందించి, వాటిని కచ్చితంగా అమలు చేయాలని అధికారులకు తెలిపారు. భూసేకరణలో న్యాయపరమైన వివాదాలు లేదా కోర్టు కేసులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి నిర్ణయం చట్టబద్ధంగా ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. మూసీ రివర్‌ఫ్రంట్ పరిధిలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక వనరుల సమీకరణపై కూడా సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రాజెక్టులకు అతి తక్కువ వడ్డీ రేట్లతో రుణ సదుపాయాలు పొందే అవకాశాలను పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో పాటు ఆర్థిక సంస్థల ద్వారా కూడా నిధుల సమీకరణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా, భూసేకరణకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించే ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్‌లు) జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. టీడీఆర్‌ల జారీ, వాటి అమలు పురోగతిపై ప్రతి వారం సమీక్ష నిర్వహించాలని సూచించారు. దీనివల్ల భూసేకరణలో పారదర్శకత పెరగడంతో పాటు ప్రాజెక్టు అమలుకు సహకారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. సమావేశంలో గండిపేట మంచిరేవుల సమీపంలో నిర్మించనున్న ఓంకారేశ్వరస్వామి ఆలయ ప్రాజెక్టుపై కూడా చర్చ జరిగింది. ఆలయ నిర్మాణ పనులను ఆలస్యం చేయకుండా తక్షణమే టెండర్లు పిలవాలని సీఎం ఆదేశించారు. ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. కొత్వాల్‌గూడలో అభివృద్ధి చేస్తున్న బర్డ్స్ పార్క్‌కు విస్తృత ప్రచారం కల్పించాలని కూడా సీఎం అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి ఈ పార్క్ దోహదపడేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని పేర్కొన్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చే కీలక ప్రాజెక్టుగా ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో, భూసేకరణ నుంచి నిర్మాణ పనుల వరకు ప్రతి దశను వేగంగా పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు అమలులో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, రంగారెడ్డి మరియు మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు, ఎంఆర్‌డీసీఎల్ ఎండీ, జేఎండీతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏడాదిలోగా దేవాదుల పూర్తి

మొదటి తరువాయి

సంబంధిత సమస్యల పేరుతో దేవాదుల పనులు సాగదీయడానికి అవకాశం ఉండదని ఉత్తమ్ స్పష్టం చేశారు. దేవాదుల ప్రాజెక్టు ప్రతి కాంపోనెంట్‌ను విడివిడిగా పరిశీలించి నిలిచి పోయిన పనులపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. భూసేకరణ, పునరావాసం, అటవీ అనుమతులు, ఇతర పరిపాలనా సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయి, అవార్డులు ఖరారైన చోట నిధుల విడుదలలో జాప్యం ఉండకూడదన్న ప్రభుత్వ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఇదే అంశంపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, చీఫ్ ఇంజినీర్లకు మార్గదర్శకాలు జారీ చేసినట్టు పేర్కొన్నారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖల సంబంధిత ఇతర విభాగాల అధికారుల సమన్వయంతో పనిచేసి పనులకు గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

6 లక్షల ఎకరాలకు సాగునీరు

దేవాదుల ప్రాజెక్టు ద్వారా 38 టీఎంసీల గోదావరి జలాలను ఎత్తిపోసి, దాదాపు 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్టు ఉత్తమ్ తెలిపారు. హన్మకొండ, వరంగల్, కరీంనగర్, జనగామ, యాదాద్రి--భువనగిరి, సూర్యాపేట, సిద్ధిపేట, మేడ్చల్--మల్కాజిగిరి, ములుగు, జయశంకర్ భూపాలపల్లి తదితర జిల్లాలు ఈ ప్రాజెక్టు ద్వారా ప్రయోజనం పొందనున్నారని వెల్లడించారు. రెండు దశాబ్దాల క్రితం చేపట్టిన ప్రాజెక్టు గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికీ అసంపూర్తిగా మిగిలిపోవడం దురదృష్టకరమన్నారు. ఇకపై జాప్యానికి తావులేకుండా, ప్రాధాన్యతతో పూర్తి చేయాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. ప్రాజెక్టులో ప్రస్తుతం అందుబాటులో ఉన్న పంపింగ్ వ్యవస్థలన్నింటిని పూర్తి సామర్థ్యంతో వినియోగించి, గోదావరి నుంచి సాధ్యమైనంత గరిష్ఠ పరిమాణంలో నీటిని ఎత్తిపోస్తామని తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకు సాగు నీరందించడంతో పాటు రిజర్వాయర్లను నింపాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ పోరిక బలరాం నాయక్, సీనియర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి, దేవాదుల ప్రాజెక్టు పరిధిలోని ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.ం

## ప్రైవేటుకు మిస్సైల్ టెక్నాలజీ

మొదటి తరువాయి

అభివృద్ధి దశ నుండి ప్రత్యక్ష పారిశ్రామిక ఉత్పత్తి దశకు వేగంగా తరలించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ టెక్నాలజీ బదిలీ హక్కులను పొందడానికి, అభివృద్ధి, ఉత్పత్తి భాగస్వామిగా ఎంపిక కావడానికి, అలాగే డీఆర్‌డీవో భాగస్వామ్యంతో ఈ మిస్సైల్ సిస్టమ్‌ల అనుసంధానాన్ని చేపట్టడానికి భారతీయ ప్రైవేట్ సంస్థల మధ్య పోటీ వేలం నిర్వహించనున్నారు. అయితే, అగ్ని సిరీస్ వంటి అణు సామర్థ్యం ఉన్న వ్యూహాత్మక మిస్సైళ్లను దీని నుంచి మినహాయించినట్లు తెలుస్తోంది.

ట్రాన్స్‌ఫర్ అయ్యే మిస్సైల్స్ ఇవే..

వెరీ షార్ట్ రేంజ్ ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్స్, యాంటీ షిప్ మిస్సైల్స్, అస్త్రా ఎయిర్-టు-ఎయిర్ మిస్సైల్, ప్రళయ్ సర్ఫేస్-టు-సర్ఫేస్ క్వాసి-బాలిస్టిక్ మిస్సైల్ వంటి సంప్రదాయ ఆయుధ టెక్నాలజీలను ప్రైవేట్ రంగానికి లైసెన్స్ ప్రాతిపదికన అందించనున్నారు. సంప్రదాయ మిస్సైళ్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించడానికి, తక్కువ వ్యయంలో భారీగా ఉత్పత్తి చేయడానికి, దేశీయ తయారీ సామర్థ్యాలను పెంచడం, రక్షణ పారిశ్రామిక స్థావరాన్ని బలోపేతం చేయడం, సప్లై చైన్‌లో భారతీయ ఎంఎస్‌ఎంఈల భాగస్వామ్యం కావడానికి అవకాశాలను సృష్టించే లక్ష్యాలతో రక్షణ శాఖ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది.

# దేశంలో విజృంభిస్తున్న హెచ్1ఎన్1 వైరస్..

**-దేశంలోని పలు రాష్ట్రాల్లో పెరుగుతున్న హెచ్1ఎన్1 కేసులు**
**-ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్నది కొత్త వైరస్ కాదన్న ఐసీఎంఆర్**
**-2009 మహమ్మారికి కారణమైన అదే వైరస్ ఇప్పటికీ కొనసాగింపు**
**-ఎక్కువ కేసుల్లో స్వల్ప లక్షణాలే.. భయపడాల్సిన అవసరం లేదన్న నిపుణులు**
**-దేశవ్యాప్తంగా సెంటినెల్ నిఘా వ్యవస్థతో నిరంతర పర్యవేక్షణ**
**-హెచ్1ఎన్1తో పాటు ఇతర శ్వాసకోశ వైరస్‌లపై కూడా నిఘా**
**-వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి**
**-మాస్క్, చేతుల పరిశుభ్రత, విశ్రాంతితో ఫ్లూపై నియంత్రణ సాధ్యం**




దేశంలోని పలు రాష్ట్రాల్లో హెచ్1ఎన్1 రకం వైరస్ కేసులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన నెలకొంది. దీనిపై 'భారత వైద్య పరిశోధనా మండలి ' స్పష్టత ఇచ్చింది. ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్నది కొత్త వైరస్ కాదని తెలిపింది. 2009లో మహమ్మారికి కారణమైన అదే ఇన్‌ఫ్లుయెంజా-ఏ (హెచ్1ఎన్1) పీడీఎం09 వైరస్ ఇప్పుడు ఫ్లూగా కొనసాగుతోందని ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బహల్ వెల్లడించారు.ప్రతి సీజన్‌లో వైరస్‌లో చిన్నపాటి జన్యు మార్పులు సహజంగానే జరుగుతాయని చెప్పారు. దానివల్ల కొత్తగా మరింత ప్రమాదకరమైన వైరస్ పుట్టినట్లుగా భావించాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో ఎక్కువ భాగం స్వల్ప లక్షణాలతోనే తగ్గిపోతున్నాయని తెలిపారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. హెచ్1ఎన్1పై ఐసీఎంఆర్ నిరంతరం నిఘా కొనసాగిస్తోంది. దేశవ్యాప్తంగా 73 ప్రత్యేక ఆసుపత్రులతో కూడిన సెంటినెల్ నిఘా వ్యవస్థ ద్వారా ప్రతివారం శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల నమూనాలను పరీక్షిస్తున్నారు. తీవ్రమైన శ్వాసకోశ ఇబ్బందులతో వచ్చే రోగులు, ఫ్లూ లక్షణాలతో వచ్చే వారి నుంచి నమూనాలు సేకరిస్తున్నారు. మరో 167 వైరస్ పరిశోధన, నిర్ధారణ ప్రయోగశాలలు కూడా పరీక్షలు నిర్వహిస్తున్నాయి. హెచ్1ఎన్1తోపాటు హెచ్3ఎన్2, ఇన్‌ఫ్లుయెంజా-బి, కొవిడ్-19, హెచ్ఎంపీవీ, అడెనోవైరస్ వంటి ఇతర వైరస్‌లను కూడా పరీక్షల్లో గుర్తిస్తున్నారు. ప్రస్తుతం హెచ్3ఎన్2 కేసులు 2-3 శాతం వరకు ఉన్నాయని ఐసీఎంఆర్ తెలిపింది. వృద్ధులు, ఐదేళ్లలోపు చిన్నారులు, గర్భిణులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. వీరిలో ఫ్లూ తీవ్రంగా మారి న్యుమోనియా వంటి సమస్యలకు దారితీసే అవకాశం ఉంటుంది. అవసరాన్ని బట్టి వైద్యుల సూచనతో సీజనల్ ఫ్లూ టీకా తీసుకోవచ్చని ఐసీఎంఆర్ తెలిపింది. హెచ్1ఎన్1 వైరస్‌వల్ల వచ్చే ఇన్‌ఫెక్షన్‌కు యాంటీబయాటిక్స్ పనిచేయవు. అవసరమైన సందర్భాల్లో వైద్యుల పర్యవేక్షణలో యాంటీవైరల్ మందులు వాడాలి. జ్వరం, దగ్గు వంటి లక్షణాలు ఉంటే ఇంట్లోనే విశ్రాంతి తీసుకోవడం, దగ్గేటప్పుడు నోరు మూసుకోవడం, చేతులు తరచూ శుభ్రం చేసుకోవడం, రద్దీ ప్రదేశాల్లో మాస్క్ ధరించడం వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించింది.

# అందుబాటులోకి స్వదేశీ ఏకే-47

**- 100 శాతం స్వదేశీ ఏకే-203 షేర్ రైఫిల్**
**- విజయవంతమైన పరీక్షలు నిర్వహణ**
**- అమేథీ జిల్లా కోర్వాలో తయారీ**



లక్నో:
భారత్ రక్షణ రంగంలో ఆత్మనిర్భరత దిశగా మరో కీలక మైలురాయిని చేరుకుంది. ఉత్తరప్రదేశ్ లోని అమేథీ జిల్లా కోర్వా ఆయుధ తయారీ కేంద్రంలో పూర్తిగా స్వదేశీ విడిభాగాలతో తయారైన తొలి ఏకే-203 షేర్ అసాల్ట్ రైఫిల్ను విజయవంతంగా పరీక్షించారు. ఇప్పటివరకు తయారైన ఏకే-203 రైఫిళ్లలో కొన్ని విడిభాగాలు రష్యా నుంచి దిగుమతి చేసుకోగా, ఈ కొత్త నమూనాలో ఉపయోగించిన ప్రతి భాగం, ముడి పదార్థం పూర్తిగా భారత పరిశ్రమల నుంచే సమకూర్చబడింది. ఈ రైఫిల్ను ఇండో-రష్యన్ రైఫిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తయారు చేసింది. ఇది భారత్, రష్యాల సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటైన సంస్థ. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమాల్లో భాగంగా భారత సైన్యానికి ఆధునిక ఆయుధాలను దేశీయంగా తయారు చేయడమే దీని ప్రధాన లక్ష్యం. ఈ విజయంతో లైసెన్స్ ఆధారిత అసెంబ్లీ దశ నుంచి పూర్తి స్వదేశీ తయారీ దశకు భారత్ చేరుకున్నట్లు అధికారులు తెలిపారు.

బర్స్ట్ ఫైరింగ్ విజయవంతం

ఫైర్ రైఫిల్ పై నిర్వహించిన ప్రారంభ పరీక్షల్లో బర్స్ట్ ఫైరింగ్ తో పాటు ఇతర సాంకేతిక పరీక్షలు విజయవంతమయ్యాయి. రైఫిల్ పనితీరు ఆశాజనకంగా ఉన్నట్లు ఇండో-రష్యన్ రైఫిల్స్ సంస్థ వెల్లడించింది. తదుపరి భారత సైన్యం సెప్టెంబర్ లో విస్తృత స్థాయి ఫీల్డ్ ట్రాయల్స్ పరీక్షల్లో కూడా విజయవంతమైతే భారత సైన్యంలో అధికారికంగా ప్రవేశపెట్టే ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఏకే-203 రైఫిల్ 7.62 ఆఅఎం 39 మిల్లీమీటర్ల మందుగుండు సామగ్రిని ఉపయోగిస్తుంది. ఇది నిమిషానికి సుమారు 700 రౌండ్ల వరకు కాల్పులు జరపగలదు. సమర్థవంతమైన కాల్పుల పరిధి దాదాపు 800 మీటర్ల వరకు ఉంటుంది. తక్కువ నిర్వహణతో కఠిన వాతావరణ పరిస్థితుల్లో కూడా విశ్వసనీయంగా పనిచేసేలా దీనిని రూపొందించారు. ఆధునిక పికాటినీ రైఫిల్ వ్యవస్థ ఉండటంతో నైట్ విజన్ పరికరాలు, ఆప్టికల్ సైట్లు వంటి అదనపు పరికరాలను అమర్చుకోవచ్చు.

ఇన్సాస్ రైఫిళ్లకు బదులుగా..

భారత సైన్యంలో ప్రస్తుతం వినియోగంలో ఉన్న ఇన్సాస్ రైఫిళ్ల స్థానంలో ఏకే-203 రైఫిళ్లను దశలవారీగా ప్రవేశపెడుతున్నారు. మొత్తం 6 లక్షలకు పైగా ఏకే-203 రైఫిళ్లను సరఫరా చేసే ప్రణాళిక అమల్లో ఉంది. పూర్తి స్వదేశీకరణతో ఉత్పత్తి వేగాన్ని కూడా పెంచాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. భవిష్యత్తులో ప్రతి 100 సెకన్లకు ఒక రైఫిల్ తయారు చేసే సామర్థ్యాన్ని సాధించాలని యోచిస్తోంది.

పూర్తి స్వదేశీ తయారీ : ఎస్ కే శర్మ

ఇండో-రష్యన్ రైఫిల్స్ సీఈఓ మేజర్ జనరల్ ఎస్.కే. శర్మ మాట్లాడుతూ ఈ విజయం కేవలం కొన్ని భాగాలను దేశీయంగా తయారు చేయడం కాదని, రైఫిల్ లోని ప్రతి భాగం, ప్రతి ముడి పదార్థం భారతీయ పరిశ్రమల నుంచే సమకూర్చడం ద్వారా నిజమైన స్వదేశీకరణ సాధించామని తెలిపారు. ఇది భారత రక్షణ తయారీ రంగానికి గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ విజయాన్ని మేక్ ఇన్ ఇండియాలో కీలక మైలురాయిగా రక్షణ రంగ నిపుణులు అభివర్ణిస్తున్నారు. విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు, దేశీయ రక్షణ పరిశ్రమను బలోపేతం చేయడంలో ఈ అభివృద్ధి కీలక పాత్ర పోషించనుంది.

# చంద్రధనలో మెగా వైద్య రక్తదాన శిబిరం విజయవంతం

**ఆమనగల్లు, ఆగస్టు25(నేటి దర్శిని)**
లయన్స్ క్లబ్ ఆఫ్ అమనగల్ ఆధ్వర్యంలో లయన్ కొత్త శంకరయ్య స్మారకార్థం చంద్రధన గ్రామంలో నిర్వహించిన మెగా వైద్య మరియు రక్తదాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు.ఈ శిబిరాన్ని పీడీజీ లయన్ జూలూరి రమేష్ బాబు, రీజియన్ చైర్మన్ లయన్ ప్రశాంత్ రెడ్డి, జోన్ చైర్మన్ లయన్ రాంరెడ్డి, చంద్రధన గ్రామ సర్పంచ్ సొల్లు రంగమ్మతో కలిసి ప్రారంభించారు.ఈ ఆరోగ్య శిబిరంలో లయన్ డాక్టర్ వి. దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలోని వైద్య బృందం సేవలందించింది. డాక్టర్ లయన్ కృష్ణ, డాక్టర్ లయన్ మహేశ్వర్ రెడ్డి, డాక్టర్ లయన్ శ్రీనివాస్ తదితర వైద్యులు సీజనల్ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్సలు మరియు వైద్య సలహాలు అందించారు.శిబిరంలో డయాబెటిస్,కంటి పరీక్షలు,బీపీ పరీక్షలతో పాటు ఈఎన్‌టీ పరీక్షలు నిర్వహించారు. ఈఎన్‌టీ వైద్య నిపుణులు లయన్ డాక్టర్ మహేశ్వర్ రెడ్డి సేవలందించగా,లయన్ డాక్టర్ వెంకటస్వామి కంటి పరీక్షలు నిర్వహించారు.లయన్ సంపత్ కుమార్,లయన్ శ్రీనివాస్ రెడ్డి డయాబెటిస్ పరీక్షలు నిర్వహించారు.వైద్య శిబిరం చైర్మన్ లయన్ ఓంకారం,కో-చైర్మన్ లయన్ రవీందర్ రెడ్డి




ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 450 మందికి పైగా ప్రజలు లయన్స్ క్లబ్ సేవలను వినియోగించుకున్నారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం పట్ల గ్రామస్థులు లయన్స్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.అదే విధంగా లయన్ అంజి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 30 మంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు.ఈ సేవా కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ గంగుల శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి గంప శ్రీనివాస్,జిల్లా చైర్మన్లు జూలూరి రమేష్,సునంద అంజయ్య,రీజియన్ సెక్రటరీ సతీష్,కె.రామ్ రెడ్డి,ఎం. రాంరెడ్డి,బండేలా రామచంద్ర రెడ్డి, గోవర్ధన్ రెడ్డి,విష్ణువాస్ రెడ్డి,గుజ్జరి నర్సింహ,కర్నాటి కొండల్ రెడ్డి, పాండు రెడ్డి,నర్సింహ రెడ్డి,తిరుపతి రెడ్డి మరియు పిఆర్ఓ పాషా, సర్పంచులు,వార్డు మెంబర్లు, గ్రామాల ముఖ్య నాయకులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యోగుల సంఘం 327 నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక




**మిడ్జిల్ , ఆగస్టు 25, (నేటి దర్శిని):**
సంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన విద్యుత్ ఉద్యోగుల సంఘం 327 కార్యవర్గ ఎన్నికల్లో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది.అధ్యక్షుడిగా ఎం. సురేష్ కుమార్ రెండోసారి ఎన్నికయ్యారు. కార్యదర్శిగా కె. భూపాల్ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా అశోక్, కోశాధికారిగా తులసీదాస్, వ్యవస్థాపక కార్యదర్శిగా మద్ది నర్సింహారెడ్డి, ప్రచార కార్యదర్శిగా జానీ భాష ఎన్నికయ్యారు. అలాగే మిగతా కార్యవర్గ సభ్యులు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, కార్యదర్శి, కార్యవర్గ సభ్యులందరికీ జడ్చర్ల డివిజన్, మహబూబ్‌నగర్ సర్కిల్ తరఫున హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం నూతన కార్యవర్గం సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

# ఆమనగల్లులో ఘనంగా మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ జన్మదిన వేడుకలు



**ఆమనగల్లు, ఆగస్టు25(నేటి దర్శిని);**
రంగారెడ్డి జిల్లా ఆమనగల్ పట్టణంలో కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్ జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. హైదరాబాద్.. శ్రీశైలం జాతీయ రహదారి ప్రక్కన కేక్ కట్ చేసి కార్యకర్తలకు, ప్రజలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ప్రజలకు చేసిన సేవలను నాయకులు కొనియాడారు. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరింత ముందుకు కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డ్ కౌన్సిలర్ పాపిశెట్టి రాము,ఎంగలి భాగ్యలక్ష్మి రఘు, దుద్దు ఆంజనేయులు,నాగిళ్ల జగన్, అనూష శ్రీశైలం, ఏనమల్ల రమేష్,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చుక్క నిరంజన్ గౌడ్, ఉప్పుల రాములు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,రామ్ నుంతల సర్పంచ్ శ్రీను నాయక్,మహేష్ నేత, పరమేష్,రామ్నుంతల మాజీ ఎంపీటీసీ సరిత పంతు నాయక్, చందు నాయక్,కోట పెద్ద శ్రీను, కొమ్ము ప్రసాద్, వడ్డీ వెంకటేష్,ఎంగలి యాదగిరి, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# రైతు బీమా,ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం నిర్లక్ష్యం

- **పాలమూరు ప్రాజెక్టులపై ప్రభుత్వం మాటలకే పరిమితం: ఎంపీ డీకే అరుణ**

**మిడ్జిల్, ఆగస్టు25 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో) :**
రాష్ట్రంలో రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పాలమూరు ఎంపీ, బీజేపీ నాయకురాలు డీకే అరుణ ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లా బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రైతు బీమా పునరుద్ధరణపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆమె అన్నారు. ఆగస్టు 13తో రైతు బీమా ప్రీమియం చెల్లింపు గడువు ముగిసినా, రైతులకు బీమా పునరుద్ధరించారా లేదా అనే విషయంపై స్పష్టత లేదన్నారు. వెంటనే రైతు బీమా పునరుద్ధరణకు నిర్ణయం తీసుకుని ప్రీమియం చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజనను రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకోవడం లేదని విమర్శించారు. వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు పంటలపై పెట్టుబడులు పెట్టి నష్టపోయే ప్రమాదం ఉందని, ప్రభుత్వం రైతులకు అండగా నిలవాలని కోరారు.

**రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు**

రాష్ట్రంలో సుమారు 40 లక్షల మంది విద్యార్థులకు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని డీకే అరుణ తెలిపారు. ఫీజులు చెల్లించలేక విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేక ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని అన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లులు పుస్తెలు అమ్ముకుని కాలేజీ ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థులు ఆందోళన చేస్తే లాఠీచార్జ్ చేయించడం దారుణమన్నారు. విద్యార్థులను అవమానించే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని, ముఖ్యమంత్రి స్వయంగా విద్యాశాఖను నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో రైతులు, యువత, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు




ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి గుర్తు చేసుకోవాలని డీకే అరుణ సూచించారు. హామీల అమలుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

**పాలమూరు ప్రాజెక్టులపై శ్వేతపత్రం ఇవ్వాలి**

పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం మూడు నెలలకు ఒకసారి హంగామా చేయడం తప్ప, క్షేత్రస్థాయిలో పనులు ముందుకు సాగడం లేదని ఆమె విమర్శించారు. గద్వాల జిల్లాలో ఆర్డీఎస్ గురించి మాట్లాడుతున్నప్పటికీ ఇప్పటికీ నీటిని విడుదల చేసే పరిస్థితి లేదన్నారు. గట్టు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు 13 ఏళ్లుగా పూర్తికాలేదని, గతంలో 1.5 టీఎంసీలుగా ఉన్న సామర్థ్యాన్ని ఇప్పుడు 3 టీఎంసీలకు పెంచుతామని ప్రభుత్వం చెబుతోందన్నారు. బుట్టెందొడ్డి 15 టీఎంసీలు, గట్టు 3 టీఎంసీలు, రేలంపాడు 4 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్లను పెంచుతామని చెబుతున్న ప్రభుత్వం, వాటిని రెండేళ్లలో పూర్తి చేస్తుందా అని ప్రశ్నించారు. కమిషన్ల కోసమే రిజర్వాయర్ల సామర్థ్యాలను పెంచుతున్నారనే అనుమానాలు ప్రజల్లో ఉన్నాయని అన్నారు. అసలు రిజర్వాయర్లకు అవసరమైన గ్రావిటీ కాలువల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

**పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు కేంద్రం సహకరిస్తుంది**

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు ఎంత నిధులు అవసరమో కేంద్రానికి ప్రతిపాదనలు పంపితే కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని డీకే అరుణ తెలిపారు. ప్రాజెక్టు మొదటి డీపీఆర్‌ను రివైజ్ చేయాలని సూచించారు. ప్రాజెక్టులకు జాతీయ హోదా అనే అంశం దేశంలో ప్రత్యేకంగా లేదని, అందువల్ల జాతీయ హోదా పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్నారు. పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పనుల పురోగతిని మీడియా ప్రతినిధులతో కలిసి స్వయంగా పరిశీలిస్తానని, ఏ ప్రాజెక్టు ఎంత పూర్తయిందో క్షేత్రస్థాయిలో చూపిస్తామని తెలిపారు.

**బీజేపీ అధికారమే లక్ష్యం**

బీజేపీ ఒక విజన్‌తో పనిచేస్తుందని, పార్టీలో ప్రతి ఒక్కరికీ అవకాశాలు కల్పించడమే కాకుండా ఎవరి సేవలను ఎక్కడ వినియోగించాలో కేంద్ర పార్టీ నిర్ణయిస్తుందని డీకే అరుణ అన్నారు. దాదాపు ఏడేళ్లపాటు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా జాతీయ కమిటీలో పనిచేశానని తెలిపారు. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పార్టీ పనిచేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఆరోపించారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మజ రెడ్డి, అంజయ్య, రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజేశ్వర్, కార్పొరేటర్లు రమేష్, మత్రి జ్యోతి, యాదయ్య, సీనియర్ నాయకులు కృష్ణవర్ధన్ రెడ్డి, ధర్పల్లి హరికృష్ణ, నందిపేట రాజు, పోతుల రాజేందర్ రెడ్డి, పద్మవేణి, బాలేశ్వరి, కరుణాకర్ రెడ్డి, నారాయణరెడ్డి, పులమోని నర్సింహులు, ముచ్చర్ల కృష్ణయ్య, అశోక్ గుప్తా, రమేష్ జీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన పోలీసు సేవలందించాలి: ఎస్పీ డి.జానకి

- **భూత్పూర్ పోలీస్ స్టేషన్‌ను వార్షికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ**





**మిడ్జిల్, ఆగస్టు 25, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ మంగళవారం భూత్పూర్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసులు, నేర నియంత్రణ చర్యలు, సిబ్బంది పనితీరును సమీక్షించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునికి సత్వర స్పందన అందించి, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్, గ్రేవ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నాణ్యమైన దర్యాప్తుతో కేసులను పరిష్కరించాలని ఆదేశించారు.
చీఎ-44 జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించాలని, రద్దీ ప్రాంతాలు, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. నేరస్థుల కదలికలపై నిఘా పెంచడంతో పాటు పెట్రోలింగ్, బీట్ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ, ఎస్ఐ నాగన్న మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఇరాన్‌పై ట్రంప్ ఆర్థిక యుద్ధం !



అమెరికా, ఇరాన్ యుద్ధంలో కొత్త అధ్యాయం మొదలయ్యింది. ఇరాన్‌ను ఆయుధాలతో దెబ్బతీయడం కుదరని పని అని అమెరికాకు తెలిసొచ్చింది. దీంతో ఇక ఆర్థిక యుద్ధం మొదలు పెట్టింది. దీంట్లోనూ ప్రపంచ దేశాలను లాగే యత్నం చేస్తోంది. ఇరాన్‌తో సంబంధాలు పెట్టుకునే దేశాలపైనా ఆంక్షలు కొనసాగిస్తామని ట్రంప్ ప్రకటించారు. ఆయుధంతో పోరాటమైనా, ఆర్థిక పోరాటమైనా తన పంతమే నెగ్గాలన్నది ట్రంప్ వాదనగా ఉంది. నేను చెప్పినట్లు వినాలన్న ధోరణితో అమెరికా ఇప్పుడు ప్రపంచ దేశాలకు హెచ్చరికలు చేస్తోంది. ఈ క్రమంలో ఇరాన్‌పై మొన్నటి వరకు భౌతిక దాడులకు పాల్పడిన అమెరికా ఇప్పుడు రూటు మార్చింది. సరికొత్త ఆంక్షల పేరుతో టెహ్రాన్ ఆర్థిక మూలాలను దెబ్బతీయాలని యోచిస్తున్నది. ఇందులో భాగంగా అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెం ఇరాన్‌పై చరిత్రలోనే అత్యంత తీవ్రమైన ఆర్థిక ఆంక్షలను ప్రకటించారు. 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌క్యాస్ట్' పేరుతో ఈ కొత్త ఆంక్షల ప్యాకేజీని ప్రకటించారు. కాగా, ఇరాన్ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా అన్ని వర్గాలపై ప్రభావం చూపుతున్నది. పెరిగిన చమురు ధరలు జీవన వ్యయంపై ఆందోళనలను పెంచాయి. పెట్రోల్,డీజిల్ ధరలు ఏడాది క్రితం కంటే చాలా ఎక్కువగా ఉండంతో అమెరికాతో పాటు అన్ని దేశాలు ఇబ్బంది పడుతున్నాయి. మరో వైపు ఇరాన్‌పై ఆంక్షలను ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహు స్వాగతించారు. ఇరాన్ ఆర్థిక మూలాలను పూర్తిగా దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. టెహ్రాన్‌పై ఇది ఒక 'ఆర్థిక డి-డే' లాంటిదని హెచ్చరించారు. డిజిటల్ ఆస్తులు, టెక్నాలజీ, బంగారం, విమానయానం, నౌకా రవాణా వంటి కీలక రంగాలను ఈ ఆంక్షల పరిధిలోకి తీసుకొచ్చారు. ఇరాన్‌తో వ్యాపారం కొనసాగించే ఇతర దేశాలు, సంస్థలపై కూడా ద్వితీయ స్థాయి ఆంక్షలు విధించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దీంతో పాటు ఇరాన్ చమురు ఆదాయం, ఆయుధాల సేకరణ, సైబర్ కార్యకలాపాలతో సంబంధం ఉన్న 60కి పైగా వ్యక్తులు, కంపెనీలు, నౌకలపై కూడా ఆంక్షలు విధించారు. ఇరాన్‌తో ఆర్థిక పోరులో ఇది చివరి అంకమని అమెరికా ప్రకటించింది. ఇరాన్‌తో సంబంధాలు తెంచుకోవాలని ప్రపంచ దేశాల నాయకులను కోరారు. మీరు మా వైపు ఉంటారా లేక మాకు వ్యతిరేకంగా ఉంటారా అని అల్టిమేటం జారీ చేశారు. ఇప్పటికే ఇరాన్‌కు మద్దతు ఇస్తున్న సుమారు 60 సంస్థలు, విదేశీ నౌకలపై అమెరికా నిఘా పెట్టింది. సహకరించే ఇతర దేశాలకూ ఆంక్షల భయం ఉంటుందని తెలిపారు. ఇరాన్‌తో ఆర్థికంగా భాగస్వామ్యం వహించే ఏ దేశమైనా ఏకాకిగా మిగిలిపోతుందని బెసెంట్ తెలిపారు. ఇరాన్‌పై కొన్నినెలలుగా దాడులు చేసిన అమెరికా ఇప్పుడు ఆర్థికంగా వెన్నువిరిచే ప్రయత్నాలు మొదలుపెట్టింది. అంతర్జాతీయంగా ఇరాన్‌కున్న ఆర్థిక సంబంధాలను తెంచేయడమే లక్ష్యంగా అగ్రరాజ్యం కొత్త ఆంక్షలను ప్రకటించింది. టెహ్రాన్‌తో సంబంధాలు కొనసాగిస్తూ, నగదు అక్రమ చలామణిలో దానికి తోడ్పడే దేశాలను డాలరు వ్యవస్థ నుంచి దూరం చేస్తామని యూఎస్ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ప్రకటించారు. దీనికి ఇరాన్ దీటుగా స్పందించింది. ట్రంప్ ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎదుర్కోవడానికి తమ వద్ద రెండేళ్ల ప్రణాళిక ఉందని, ప్రతీకార చర్యలు తప్పవని బదులిచ్చింది. ఇరాన్ పై అమెరికా ఆంక్షలు విధించడం కొత్తేం కాదు. ఇరాన్‌కు ప్రపంచంతో ఉన్న ఆర్థిక జీవనాధారాన్ని తెగ్గొట్టడమే తాజా ఆంక్షల లక్ష్యమని బెసెంట్ ప్రకటించారు. అయితే యూఎస్ నుంచి ఎదురయ్యే ఒత్తిడిని తమ వాణిజ్య భాగస్వాములు గట్టిగా వ్యతిరేకిస్తారని టెహ్రాన్ విశ్వాసం వ్యక్తంచేసింది. ఈ మేరకు ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ గాలిబఫ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఇతర దేశాలతో ఇరాన్‌కున్న సంబంధాలను తెగ్గొట్టే స్థితిలో అమెరికా లేదన్నారు. అమెరికన్ల ప్రగల్భాలను ఎవరూ నమ్మరు. అమెరికా ఆంక్షలప్రకటనను పరిగణనలోకి తీసుకోబోమని మా వాణిజ్య భాగస్వాములు ఇప్పటికే మాకు సందేశాలు పంపారని పేర్కొన్నారు. యూఎస్ ప్రకటనపై ఇటు ఇరాన్ ప్రభుత్వం కూడా ఘాటుగా స్పందించింది. ట్రంప్ ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎదుర్కొవడానికి మా వద్ద రెండేండ్ల ప్రణాళిక ఉందని, ప్రతీకార దాడులు తప్పవని బదులిచ్చింది. ఇరాన్ ఆర్థిక మంత్రి అలీ మదనీజాదేహ్ మాట్లాడుతూ.. అమెరికా ఆంక్షలను ఎదుర్కొనేందుకు మేం సర్వసన్నద్ధంగా ఉన్నాం. శత్రువులు మాపై ఆర్థిక ఉగ్రవాద దాడికి పాల్పడాలని చూస్తున్నారు. కానీ, మా వద్ద కూడా తగిన సాధనాలు ఉన్నాయి. ఇకపై మాది కేవలం రక్షణెళి కాదు, శత్రువులు మా దాడి కోసం ఎదురుచూడాలని హెచ్చరించారు. అమెరికా ఆంక్షలను చైనా, రష్యా అంగీకరిం చలేదని, ఇతర దేశాలు కూడా ప్రతిఘటిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మొహసెన్ రెజాయ్ మరింత ఘాటుగా స్పందించారు. అమెరికాకు సహకరించే ఏ దేశమైనా 'భూకంపం లాంటి' ప్రతీకారాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. పొరుగు దేశాలు సహకరిస్తే పర్షియన్ గల్ఫ్ లేదా హోర్ముజ్ జలసంధి నుంచి చుక్కనూనె కూడా బయటకు వెళ్లనివ్వబోమని తేల్చిచెప్పారు. మరోవైపు ఇరాన్ ఆర్థిక మంత్రి అలీ మదానీజాదేహ్ కూడా ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. అమెరికాకు మరో ఓటమి తప్పదు. వాషింగ్టన్ విధించిన కొత్త ఆంక్షలను ఎదుర్కోవ డానికి మా వద్ద రెండేళ్ల ప్రణాళిక ఉంది. ఇరాన్ ప్రజలు, దేశ అధికారుల సంకల్పాన్ని పరీక్షించడానికి వారు చేయగలిగిందంతా చేశారు. కానీ ప్రతిసారీ విఫలమయ్యారని యూఎస్‌కు కౌంటర్ ఇచ్చారు. 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట్' పేరిట 60 సంస్థలు, వ్యక్తులు, నౌకలపై అమెరికా ఆంక్షలు విధించింది. ఇరాన్ సైనిక కార్యకలాపాలు, పెట్రోలియం, పెట్రోకెమికల్ వాణిజ్యంతో సంబంధాలున్నాయని ఆరోపిస్తూ వాటిని ప్రకటించింది.

# హలో జర్నలిస్ట్..చలో ఢిల్లీ...

మొదటి తరువాయి





క్షుణ్ణంగా అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను జాతీయస్థాయిలో చర్చించేందుకు తాను ఎప్పుడు సిద్ధంగా ఉంటానని ఎంపీ పేర్కొన్నారు. వృత్తినే జీవనాధారంగా పనిచేస్తున్నటువంటి జర్నలిస్టులకు తాను ఎప్పుడు అండగా ఉంటానని, తెలంగాణ యునైటెడ్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే) యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టే ప్రతి కార్యక్రమానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఎంతోమంది నిరుపేద జర్నలిస్టులకు, నిరుపేద ప్రజానీకానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నటువంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఎంపి సూచించారు. ముఖ్యంగా ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అటువంటి ఆరోగ్య సంక్షేమ పథకాలను జర్నలిస్టులు, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలపై త్వరలో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లే విధంగా కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు యూనియన్ ప్రతినిధులు, వివిధ తెలుగు దినపత్రికల విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో పెరిగిపోతున్న ఉల్లి ధరలు..

**ఇప్పటికే భారమైన చక్కెర..**
**సామాన్యుడి ఇక్కట్లు**

**న్యూఢిల్లీ ఆగస్టు 25 (నేటి దర్శిని)**
దేశంలో ఇటీవలి కాలంలో ఉల్లి ధరలు పెరిగిపోతున్నాయి. దీంతో సామాన్యుడిపై ఆర్థిక భారం పెరుగుతోంది. ఇప్పటికే చక్కెర ధరలు పెరిగిన సంగతి తెలిసిందే. ఇటు ఇతర కూరగాయల ధరలు కూడా నెమ్మదిగా పెరగుతున్నాయి. దీంతో వంటింటి ఖర్చు పెరిగి, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అసలే, ఇది శ్రావణ మాసం. పైగా వరుసగా పండుగలు జరుపుకొనే సమయం.ఈ సమయంలో ఉల్లి, చక్కెర వంటి నిత్యావసరాల ధరలు భారంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో ధరల కట్టడికి కేంద్రం రంగంలోకి దిగింది. దీనిలో భాగంగా కేంద్రం ఉల్లి నిల్వల్ని



పెంచుతోంది. ఇందుకోసం మహారాష్ట్రలోని నాసిక్ నుంచి ప్రత్యేకంగా కంద ఎక్స్‌ప్రెస్ రైలును అనేక ప్రాంతాలకు పంపిస్తోంది. ఈ రైలు నిండా ఉల్లి నిల్వలున్నాయి. మొట్టమొదటగా ఈ రైలు ఢిల్లీ చేరుకుంది. ఈ రైలులో 800 మెట్రిక్ టన్నుల ఉల్లి నిల్వలున్నాయి. దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా ఉల్లి నిల్వలతో కూడిన రైళ్లను పంపిస్తారు. గత నెల రోజులుగా మార్కెట్‌లోకి ఉల్లి సరఫరా బాగా తగ్గిందని వ్యాపారులు అంటున్నారు. ఉల్లి ధరలు పెరగడానికి కారణం ప్రస్తుత ఖరీఫ్ పంట ఆలస్యం కావడమే. ఇప్పుడు మార్కెట్లో ఉన్న ఉల్లి రబీ పంట ద్వారా వచ్చింది. ఈ పంట నిల్వలు ఇప్పుడు పూర్తవుతున్నాయి. అయితే, ఖరీఫ్ ఆలస్యం కావడం వల్ల ఉల్లి దిగుబడి ఇంకా రాలేదు. దీంతో ధరలు పెరుగుతున్నాయి. మార్కెట్ వర్గాల ప్రకారం సెప్టెంబర్‌తోపాటు అక్టోబర్‌లో కూడా ఉల్లి ధరల పెరుగుదల ఉండే అవకాశం ఉంది. ఖరీఫ్ పంట దిగుబడి వచ్చే వరకు ధరల పెరుగుదల ఉంటుంది. ప్రస్తుతం రిటైల్ మార్కెట్లో ఉల్లి కిలో ధర సగటున రూ.42 వరకు పలుకుతోంది. ఢిల్లీలాంటి చోట్ల రూ.65-రూ.70 వరకు ఉంటోంది. ఈ ధరలు ఇంకా పెరిగే ఛాన్స్ ఉంది. ఇదే సమయంలో చక్కెర ధరలు కూడా ఇటీవల పెరుగుతున్న సంగతి తెలిసిందే.

# రష్యాలో దిగిన అమెరికా యుద్ధ విమానం..

**సమాచారం లేదన్న రష్యా ప్రభుత్వం**

**న్యూఢిల్లీ ఆగస్టు 25 (నేటి దర్శిని)**
అమెరికాకు చెందిన యుద్ధ విమానం రష్యాలో దిగడం సంచలనం కలిగిస్తోంది. అమెరికా-రష్యాల మధ్య ఉన్న వైరం గురించి తెలిసిందే. అలాంటిది, అమెరికాకు చెందిన యుద్ధ విమానం ఇప్పుడు రష్యాలోని మాస్కోలో ల్యాండ్ అవ్వడం ఆసక్తి కలిగిస్తోంది. విమానాల రవాణాను ట్రాక్ చేసే ఫ్లైట్‌రాడార్24 సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం.. ద బోయింగ్ సి-17 గ్లోబ్‌మాస్టర్ అనే అమెరికాకు చెందిన యుద్ధ విమానం రష్యాలోని మాస్కోలో ల్యాండ్ అయింది.భారత కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఈ విమానం ల్యాండ్ అయినట్లు తెలుస్తోంది. ఇది ఈ రోజు ఉదయం



లాట్వియా దేశంలోని రిగా నుంచి బయల్దేరింది. ఇది సైనిక రవాణా విమానం. అమెరికా, వాషింగ్టన్ డీసీలోని స్ప్రింగ్స్ ఎయిర్‌బేస్ క్యాంప్ నుంచి ఆగష్టు 23న ఈ విమానం బయల్దేరి రిగా వెళ్లింది. అక్కడి నుంచి ఇప్పుడు రష్యా చేరుకుంది. ఉక్రెయిన్, రష్యా మధ్య ఇటీవల మళ్లీ యుద్ధం తీవ్రరూపం దాల్చిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో రెండు దేశాల మధ్య శాంతి కోసం ఇంతకుముందు అమెరికా చేసిన ప్రయత్నాలు నిలిచిపోయాయి. అయితే, ఈ అంశంపై చర్చించేందుకు అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవెన్ విట్‌కాఫ్, జెర్డ్ కుష్నర్ త్వరలో రష్యా రావాల్సి ఉంది. ఈ చర్చల్లో భాగంగానే అమెరికా విమానం రష్యా వచ్చిందా అనే సందేహాలున్నాయి. అయితే, దీనిపై అమెరికా నుంచి ఇంకా ఎలాంటి ప్రకటనా రాలేదు. మరోవైపు ఈ విమానం గురించిన సమాచారం తమకు కూడా తెలియదని రష్యా ప్రభుత్వం తెలిపింది. అది కార్గో విమానమా, ప్యాసింజర్ విమానమా అనేది కూడా తెలియదని పేర్కొంది. అమెరికా ప్రతినిధులు రష్యాను సందర్శించినప్పుడు లేదా కీలక సందర్భాల్లో మాత్రమే అమెరికా యుద్ధ విమానాలు రష్యా వెళుంటాయి. చివరగా గత జనవరిలో అమెరికా ప్రతినిధులు రష్యాలో పర్యటించినప్పుడు మాత్రమే ఒక అమెరికన్ యుద్ధ విమానం రష్యా వెళ్లింది. మళ్లీ ఇప్పుడు మరో విమానం రష్యాలో ల్యాండ్ అయింది. ఇప్పుడు రెండు దేశాల నుంచి దీనిపై స్పష్టమైన ప్రకటన రావాల్సి ఉంది.

# ఇరాన్‌పై అత్యంత తీవ్రమైన ఆర్థిక ఆంక్షలు విధించిన అమెరికా..

**-ఎదుర్కొనేందుకు సిద్ధమన్న టెహ్రాన్**

**న్యూఢిల్లీ ఆగస్టు 25 (నేటి దర్శిని)**
ఇరాన్‌పై మొన్నటి వరకు భౌతిక దాడులకు పాల్పడిన అమెరికా ఇప్పుడు రూటు మార్చింది. సరికొత్త ఆంక్షల పేరుతో టెహ్రాన్ ఆర్థిక మూలాలను దెబ్బతీయాలని యోచిస్తున్నది. ఇందులో భాగంగా అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ ఇరాన్‌పై చరిత్రలోనే అత్యంత తీవ్రమైన ఆర్థిక ఆంక్షలను ప్రకటించారు. 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌క్యాస్ట్' పేరుతో ఈ కొత్త ఆంక్షల ప్యాకేజీని ప్రకటించారు. ఇరాన్ ఆర్థిక మూలాలను పూర్తిగా దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. టెహ్రాన్‌పై ఇది ఒక 'ఆర్థిక డి-డే' లాంటిదని హెచ్చరించారు. డిజిటల్ ఆస్తులు, టెక్నాలజీ, బంగారం, విమానయానం, నౌకా రవాణా వంటి కీలక రంగాలను ఈ ఆంక్షల పరిధిలోకి తీసుకొచ్చారు. ఇరాన్‌తో వ్యాపారం కొనసాగించే ఇతర దేశాలు, సంస్థలపై కూడా ద్వితీయ స్థాయి ఆంక్షలు విధించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.దీంతో పాటు ఇరాన్ చమురు ఆదాయం, ఆయుధాల సేకరణ, సైబర్ కార్యకలాపాలతో సంబంధం ఉన్న 60కి పైగా వ్యక్తులు, కంపెనీలు, నౌకలపై కూడా ఆంక్షలు విధించారు. ఇరాన్‌తో ఆర్థిక పోరులో ఇది చివరి అంకమని అమెరికా ప్రకటించింది. ఇరాన్‌తో



సంబంధాలు తెంచుకోవాలని ప్రపంచ దేశాల నాయకులను కోరారు. మీరు మా వైపు ఉంటారా లేక మాకు వ్యతిరేకంగా ఉంటారా" అని అల్టిమేటం జారీ చేశారు. ఇప్పటికే ఇరాన్‌కు మద్దతు ఇస్తున్న సుమారు 60 సంస్థలు, విదేశీ నౌకలపై అమెరికా నిఘా పెట్టింది. సహకరించే ఇతర దేశాలకూ ఆంక్షల భయం ఉంటుందని తెలిపారు. ఇరాన్‌తో ఆర్థికంగా భాగస్వామ్యం వహించే ఏ దేశమైనా ఏకాకిగా మిగిలిపోతుందని బెసెంట్ తెలిపారు. యూఎస్ ప్రకటనపై ఇటు ఇరాన్ ప్రభుత్వం కూడా ఘాటుగా స్పందించింది. ట్రంప్ ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎదుర్కొవడానికి మా వద్ద రెండేండ్ల ప్రణాళిక ఉందని, ప్రతీకార దాడులు తప్పవని బదులిచ్చింది. ఇరాన్ ఆర్థిక మంత్రి అలీ మదనీజాదేహ్ మాట్లాడుతూ.. "అమెరికా ఆంక్షలను ఎదుర్కొనేందుకు మేం సర్వసన్నద్ధంగా ఉన్నాం. శత్రువులు మాపై ఆర్థిక ఉగ్రవాద దాడికి పాల్పడాలని చూస్తున్నారు. కానీ, మా వద్ద కూడా తగిన సాధనాలు ఉన్నాయి. ఇకపై మాది కేవలం రక్షణే కాదు, శత్రువులు మా దాడి కోసం ఎదురుచూడాలి" అని హెచ్చరించారు. అమెరికా ఆంక్షలను చైనా, రష్యా అంగీకరించలేదని, ఇతర దేశాలు కూడా ప్రతిఘటిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మొహసెన్ రెజాయ్ మరింత ఘాటుగా స్పందించారు. అమెరికాకు సహకరించే ఏ దేశమైనా 'భూకంపం లాంటి' ప్రతీకారాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. పొరుగు దేశాలు సహకరిస్తే పర్షియన్ గల్ఫ్ లేదా హోర్ముజ్ జలసంధి నుంచి చుక్క నూనె కూడా బయటకు వెళ్లనివ్వబోమని తేల్చిచెప్పారు. కాగా, ఇరాన్ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా అన్ని వర్గాలపై ప్రభావం చూపుతున్నది. పెరిగిన చమురు ధరలు జీవన వ్యయంపై ఆందోళనలను పెంచాయి. పెట్రోల్,డీజిల్ ధరలు ఏడాది క్రితం కంటే చాలా ఎక్కువగా ఉండంతో అమెరికాతో పాటు అన్ని దేశాలు ఇబ్బంది పడుతున్నాయి. మరో వైపు ఇరాన్‌పై ఆంక్షలను ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహు స్వాగతించారు.

# ఉమ్మడి జిల్లాలో విస్తృతంగా వన మహోత్సవం





**మిడ్జిల్, ఆగస్టు 25, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వన మహోత్సవంలో భాగంగా భారీ స్థాయిలో మొక్కలు నాటడంతో పాటు నీటి, మట్టి సంరక్షణ పనులు చేపడుతున్నట్లు జోగులాంబ-యాదాద్రి సర్కిల్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శివాల రాంబాబు తెలిపారు. మంగళవారం అప్పన్నపల్లి గ్రామంలో టీబీ ఆసుపత్రి మార్గం పక్కన నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక్కరోజే 70 వేల మొక్కలు నాటినట్లు తెలిపారు. గద్వాలలో 32 వేలు, నారాయణపేటలో 7 వేలు, వనపర్తిలో 15 వేలకుపైగా మొక్కలు నాటుతున్నట్లు వెల్లడించారు. మొక్కలు నాటడంతో పాటు చెక్‌డ్యామ్‌లు, పెర్కొలేషన్ ట్యాంకులు, వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, నాటిన మొక్కలను సంరక్షించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి పి. శ్రీనివాస్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇస్రా నాయక్, డిప్యూటీ రేంజ్ అధికారి ఎం.డి. జకిరుద్దీన్, అటవీ శాఖ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ తల్లి దేవాలయ రథ నిర్మాణానికి రూ.50 వేల విరాళం

● **బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి**



**మిడ్జిల్, ఆగస్టు 25, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో) :**
మక్తల్ నియోజకవర్గం ఉట్కూర్ మండలం కొల్లూరు గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి దేవాలయంలో నూతనంగా నిర్మిస్తున్న రథానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి రూ.50,000 విరాళంగా అందజేశారు. గ్రామ భక్తుల కోరిక మేరకు గతంలో ఇచ్చిన మాట ప్రకారం మంగళవారం ఎల్లమ్మ తల్లి దేవాలయాన్ని సందర్శించిన ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, రథ నిర్మాణానికి తన వంతు సహాయంగా రూ.50 వేల నగదును భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణమ్మకు కేంద్ర మంత్రిగా అవకాశం కల్పించాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు గ్రామ సర్పంచ్ శశిరేఖ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సమృద్ధి, శంకర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, టి. రాంరెడ్డి, విజయ్ రామ్, వి. వెంకటేశ్వర్ రెడ్డి, ఎం. రాంరెడ్డి, బీజేపీ బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు, గ్రామ భక్తులు పాల్గొన్నారు.

# శ్రీ నాగ సాయి చంద్ర హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో పుస్తకాల వితరణ






**ఉమ్మడి వరంగల్, ఆగస్టు 25 (నేటి దర్శిని బ్యూరో):**
సమాజంలో మానవ విలువలుఅంతరించిపోతున్న ఈ తరుణంలో శ్రీ నాగ సాయి చంద్ర హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవసరమైన వస్తువులను అందించిన విధానము వారి సేవా నిరతి కి నిదర్శనమని వరంగల్ ఎంఈఓ వెంకటేశ్వరరావు అన్నారు. శ్రీ నాగ సాయి చంద్ర హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షులు నూగూరి చంద్రమోహన్, కోర్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వరంగల్ ఎల్ బి నగర్ ప్రభుత్వ మాసూమ్ ఆలీ ఉన్నత పాఠశాలలోని భవిత సెంటర్ లో చదువుకుంటున్న అవసరార్థ విద్యార్థులకు 30,000 వేల రూపాయలు విలువగల ఉచితంగా వాటర్ ప్యూరిఫైయర్, వాటర్ ఫిల్టర్, స్టీల్ వాటర్ బాటిల్స్, నోట్ పుస్తకాలు,హాట్ బాక్సులు పెన్సిళ్లతో పాటుచదువుకోవడానికి అవసరం అయ్యే వస్తువులు అందించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ మండల విద్యాధికారి ఎస్ వెంకటేశ్వర్ రావు హాజరై విద్యార్థులకు పై వస్తువులతోకూడిన కిట్లను అందచేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ అవసరార్థులకు ఆపన్న హస్తం అందిస్తూ మేమున్నామంటూ ముందుకు వచ్చిన శ్రీ నాగ సాయి చంద్ర హెల్పింగ్ హాండ్స్ నిర్వాహకులను కొనియాడారు. అవసరార్థులకు పుస్తకాలతో కూడిన కిట్లను అందించడాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నతంగా చదువుకోవాలని కోరారు. రాబోయే కాలంలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ సహాయ కార్యదర్శి, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ హనుమకొండ జిల్లా కోశాధికారి డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, భవిత సెంటర్ ఇంచార్జ్ కే. సువర్ణ, ఉపాధ్యాయురాలు పి. స్వాతి, కోర్ కమిటీ సభ్యులు డి .శశికిరణ్, ఎం. శ్రీనివాస్, కే శ్రీధర్ , కాశీనాథ్, రఘువంష్, సుభాష్, రామకృష్ణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు

# డిగ్రీ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి





● **బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి**

**మిడ్జిల్ , ఆగస్టు 25, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో ):**
ఆత్మకూరు పట్టణంలోని డిగ్రీ కళాశాలలో నిర్వహించిన నూతన విద్యార్థుల ఆహ్వాన కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా.బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాలలో గతంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు తన సొంత నిధులతో సుమారు రూ.2 లక్షలు వెచ్చించి మూడు బోర్లు వేయించిన లక్ష్మీకాంత్ రెడ్డిని కళాశాల బృందం ప్రత్యేకంగా సన్మానించి అభినందించింది. ఈ సందర్భంగా లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ... కళాశాలలో ఉన్న రహదారి, గ్రీన్ బోర్డులు, సీసీ కెమెరాలు, కాంపౌండ్ వాల్, లైబ్రరీ, ల్యాబ్ తదితర సమస్యలను ఎంపీ డీకే అరుణమ్మ దృష్టికి తీసుకెళ్లి



త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షులు ఎం. అశోక్ భూపాల్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించిన లక్ష్మీకాంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ నాయకులు హామీలకే పరిమితం కాకుండా అభివృద్ధి పనులు చేసి చూపిస్తారని, భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే ఆత్మకూరు అభివృద్ధికి రూ.100 కోట్లతో కృషి చేస్తామని తెలిపారు. టౌన్ అధ్యక్షులు మండల సురేష్ కుమార్ కళాశాలలోని ఇతర సమస్యలను కేంద్ర నిధులతో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా నాయకులు కె. ఆనంద్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రులకు, ఆత్మకూరు మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎం. అశోక్ భూపాల్ యాదవ్, మండల సూరి, 6వ వార్డు కౌన్సిలర్ పుల్లారి భరత్, ఆంజనేయులు ముదిరాజ్, అశ్విన్ కుమార్, విష్ణువర్ధన్ రెడ్డి, బాలకృష్ణ, దండు రవి, ఎల్.టి. లక్ష్మీకాంత్, బల్వీర్ తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్రభుత్వం అండ.. ఉచిత షూలు, కాలేజీ బ్యాగుల పంపిణీ





● **ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం**
● **చేసుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి**
**ప్రిన్సిపాల్ బి. ధన్‌రాజ్**

**చింతపల్లి, ఆగస్టు 25 (నేటి దర్శిని):**
విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత షూలు, కాలేజీ బ్యాగులను చింతపల్లి మండల కేంద్రంలోని డాక్టర్ ఆలుకా జైహింద్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ బి. ధన్‌రాజ్ చేతుల మీదుగా విద్యార్థులకు షూలు, బ్యాగులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ధన్‌రాజ్ మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత విద్య కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. క్రమశిక్షణతో విద్య.. సమాజ సేవలో భాగస్వామ్యం విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. యువత చెడు మార్గాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో పయనించాలని సూచించారు. విద్యతో పాటు సమాజ సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధన్‌రాజ్‌తో పాటు అధ్యాపకులు కిరణ్ కుమార్, రామస్వామి, వాసు, ప్రభాకర్ రెడ్డి, అంజయ్య, లావణ్య, శివకుమార్, ఉమాశేఖర్, రమేష్, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాజీపేట నూతన బస్‌స్టాండ్‌కు భూమి మార్పిడి ప్రక్రియ వేగవంతం చేయాలి

● **వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసిన ఎంపీ**

**ఉమ్మడి వరంగల్, ఆగస్టు 25 (నేటి దర్శిని బ్యూరో):**
కాజీపేట నూతన బస్‌స్టాండ్ నిర్మాణానికి అవసరమైన భూమి మార్పిడి ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్‌లోని మంత్రి క్వార్టర్స్‌లో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కాజీపేట సిగ్నల్ జంక్షన్ వద్ద దక్షిణ మధ్య రైల్వేకు చెందిన భూమిని రాష్ట్ర ప్రభుత్వ భూమితో సమాన భూ విలువ ప్రాతిపదికన మార్పిడి చేసేందుకు రైల్వే ప్రతిపాదించిన విషయాన్ని మంత్రి దృష్టికి ఎంపీ తీసుకెళ్లారు. ఈ మేరకు



అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించి, రైల్వేతో ప్రతిపాదిత భూముల మార్పిడికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని కోరారు. ప్రభుత్వ భూమి లభ్యత, అనుకూలతను పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని మంత్రిని విజ్ఞప్తి చేశారు. కాజీపేట నూతన బస్‌స్టాండ్ నిర్మాణం పూర్తయితే కాజీపేటతో పాటు వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలుఅందుబాటులోకి వస్తాయని ఎంపీ డా.కడియం కావ్య తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం రైల్వే, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంతో భూమి మార్పిడి ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, నిర్మాణ పనులకు మార్గం సుగమం చేయాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కాజీపేట నూతన బస్‌స్టాండ్ నిర్మాణ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఎంపీ డా. కడియం కావ్య కోరారు.

# సన్న వరి రైతులకు రూ.500 బోనస్!

**● సెప్టెంబర్ 10లోగా ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి.**
**● 7 రకాల సన్న వడ్లకే బోనస్.. రైతులు గడువు మిస్ కావొద్దు.**

**చింతపల్లి, ఆగస్టు 25 (నేటి దర్శిని):** సన్న వరి సాగు చేస్తున్న రైతులకు తెలంగాణ ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించింది. వానాకాలం సీజన్ 2026-27లో ఈ ప్రయోజనం పొందాలంటే రైతులు తమ వివరాలను సెప్టెంబర్ 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని చింతపల్లి మండల వ్యవసాయ అధికారిణి శ్రావణ కుమారి సూచించారు.

రూ.500 బోనస్‌కు గడువు సెప్టెంబర్ 10

సన్న వరి సాగు చేస్తున్న అర్హులైన రైతులు నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత గడువులోగా నమోదు పూర్తి చేసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు.

బోనస్‌కు అర్హమైన 7 రకాలివే

తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్-15048)
సాంబమసూరి (బీపీటీ-5204)
కేఎన్ఎం-1638



హెచ్ఎమ్‌టీ సోనా
జైశ్రీరామ్
డబ్ల్యూజీ-44
కేఎన్ఎం-7715

డీలర్ వద్ద విత్తనాలు కొన్నారా?

విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్‌ను సంప్రదించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలి.

సమర్పించాల్సినవి:

ఆధార్ కార్డు జిరాక్స్
పట్టాదార్ పాస్‌బుక్ జిరాక్స్
విత్తనాల కొనుగోలు బిల్లు

సొంత విత్తనాలు వేసుకున్న రైతులూ నమోదు చేసుకోవాలి

సొంత విత్తనాలు ఉపయోగించినా, ఇతర రైతుల నుంచి విత్తనాలు తీసుకున్నా, వ్యవసాయ పరిశోధనా కేంద్రాల ద్వారా పొందినా రైతు ధ్రువీకరణ పత్రంతో ఏఈఓను సంప్రదించాలి.
ఆధార్ కార్డు, పాస్‌బుక్ జిరాక్స్‌తో పాటు రైతు ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. వివరాలను ఏఈఓలు ధ్రువీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

గడువు మిస్ అయితే అవకాశం కోల్పోయే అవకాశం!

సెప్టెంబర్ 10లోగా నమోదు పూర్తి చేసుకుని రూ.500 బోనస్ ప్రయోజనం పొందండి అర్హులైన సన్న వరి రైతులందరూ ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారులు కోరారు.

### మతసామరస్యంతో 'మిలాద్ ఉన్ నబి'
# వేడుకలను నిర్వహించాలి

**● ఎస్ హెచ్ఓ వెంకటేశ్వర్లు**




**ఆమనగల్లు, ఆగస్టు25(నేటి దర్శిని);** ఆమనగల్లు మండలంలోని ముస్లిం సోదరులకు ఆమనగల్లు సిఐ వెంకటేశ్వర్లు మిలాద్ ఉన్ నబి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పండగను ప్రశాంత వాతావరణంలో, మతసామరస్యానికి ప్రతీకగా నిర్వహించాలని, సామాజిక మాధ్యమాల్లో పుకార్లు, రెచ్చగొట్టే పోస్టులు, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయవద్దని సూచించారు. అన్ని మతాల ప్రజలు పరస్పర సహకారంతో సోదర భావాన్ని చాటుతూ వేడుకలను విజయవంతం చేయాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్.వెంకటేశ్వర్లు ప్రజలను కోరారు.

# పశుగ్రాసానికి పరేషాన్ వద్దు

**● పాడి రైతులకు అండగా ప్రభుత్వం.. గడ్డి విత్తనాల పంపిణీ**

**చింతపల్లి, ఆగస్టు 24 (నేటి దర్శిని):** పాడి రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని మండల పశు వైద్యాధికారి డాక్టర్ భాను కిరణ్ తెలిపారు. ఏలినో ప్రభావంతో పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గడ్డి విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఎకరాకు 20 కిలోలు ఉచితంగా..చింతపల్లి మండల పశువైద్యశాలలో అధిక దిగుబడినిచ్చే



బహువార్షిక గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ భాను కిరణ్ తెలిపారు. రైతులు ఆధార్ కార్డు, పాస్‌బుక్ చూపించి ఎకరాకు 20 కిలోల గడ్డి విత్తనాలను పొందవచ్చని సూచించారు.పాడి పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టివ్యవసాయానికి అనుబంధంగా పాడి పశువుల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. సబ్సిడీపై పాడి పశువులను అందించడంతో పాటు గ్రామాలు, మండల కేంద్రాల్లోని పశువైద్యశాలల ద్వారా పశువులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు.పశుగ్రాస కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని రైతు సోదరులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ భాను కిరణ్ కోరారు.

# నిరుపేద చిన్నారులకు అల్పాహారం..

**● సేవా కార్యక్రమంతో సురేష్ జీ జన్మదిన వేడుకలు**



**హైదరాబాద్, ఆగస్టు 25(నేటి దర్శిని):** కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన ధావ్లే సురేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం అనాథ, నిరుపేద చిన్నారులు విద్యనభ్యసిస్తున్న పాఠశాలలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 300 మంది చిన్నారులకు ఉదయం అల్పాహారం ఏర్పాటు చేశారు. చిన్నారులు ఆనందంగా అల్పాహారం స్వీకరించి, జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంగా నిర్వహించిన సురేష్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. జన్మదినాన్ని పురస్కరించుకుని నిరుపేద చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు తీసుకురావడం ద్వారా సురేష్ జీ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారని సమితి ప్రతినిధులు పేర్కొన్నారు. సేవా కార్యక్రమంలో సమితి అధికారులు, సభ్యులు పాల్గొని సురేష్ జీకి శుభాకాంక్షలు, కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వారు ఆకాంక్షించారు. "సేవే మానవత్వానికి నిజమైన గుర్తింపు. ఒకరి జన్మదిన ఆనందాన్ని 300 మంది చిన్నారుల సంతోషంగా మార్చడమే నిజమైన వేడుక" అని సమితి ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ధావ్లే సురేష్ కి కృష్ణ గోపాల్ సేవా సమితి తరపున జన్మదిన శుభాకాంక్షలు, హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ





**ఉమ్మడి వరంగల్, ఆగస్టు 25 (నేటి దర్శిని బ్యూరో):** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, చెట్లు మనకు ప్రాణదారమని, చెట్లను నరికి వేయడం వల్ల వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ జిల్లా రంగసాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమానికి దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇంటింటా మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణ అందించాలంటే పచ్చదనం పెంపొందించాలని అన్నారు. ముందుగా మంత్రి మొక్కలు నాటి వనమోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు . వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం ప్రాధాన్యతకు సంబంధించిన ప్రదర్శనను మంత్రి కొండ సురేఖ పరిశీలించారు. విద్యార్థుల ప్రదర్శనలు అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ . సత్య శారద ,అధికారులు, ప్రజాప్రతినిధులు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# కుర్మేడులో స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ

**● ప్రజలకు మరింత సులభంగా రేషన్ సేవలు అందించడమే లక్ష్యం**
**● గ్రామ సర్పంచ్ కంబాలపల్లి చెన్నమ్మ లాలయ్య**



**లచింతపల్లి, ఆగస్టు 25 (నేటి దర్శిని):** చింతపల్లి మండలం కుర్మేడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంభాలపల్లి చెన్నమ్మ లాలయ్య పాల్గొని కార్యక్రమాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు రేషన్ సేవలు మరింత సులభతరం కానున్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రముఖుల హాజరు కార్యక్రమంలో జీపీఓ రమేష్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ హరి నాయక్, మాజీ సర్పంచ్ రాటకొండ రుద్రమదేవి, ఆర్.ఎన్. ప్రసాద్, మాజీ ఎంపీటీసీ ఉప్పు శ్రీశైలం, మాజీ సర్పంచ్ గౌని జంగయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు బుర్రి కృష్ణయ్య, మాజీ వార్డు సభ్యుడు బుర్రి యాదయ్య, జంగయ్య, గునిగంటి శ్రీను, పొలమేని శేఖర్, గౌని శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.రేషన్ డీలర్ పొగాకు ఈశ్వరప్ప గౌని జైహింద్ గ్రామ ప్రజలు, సంబంధిత సిబ్బంది గ్రామ ప్రజలు కార్యక్రమంలో పాల్గొన్నారు

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి

**- బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్క యశస్వి**

**హైదరాబాద్ ఆగస్టు 25 (నేటి దర్శిని):** తెలంగాణ రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్యా సంవత్సరాలు పూర్తయినప్పటికీ సర్టిఫికెట్లు అందక ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల విషయంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యశస్వి మల్క ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రామచందర్ రావు గారి నాయకత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మంది మద్దతు సేకరించడమే లక్ష్యంగా ఉద్యమాన్ని చేపట్టామని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ కళాశాలల్లో బీజేవైఎం కార్యకర్తల ఆధ్వర్యంలో సుమారు 3.5 లక్షల సంతకాలను సేకరించామని, ఈ వారాంతానికి ఆ సంఖ్యను 5 లక్షలకు పెంచి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వెల్లడించారు.నాలుగేళ్ల క్రితం విద్యను పూర్తి చేసిన విద్యార్థులకు సైతం కొన్ని కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు




విడుదల కాకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని యశస్వి మల్క పేర్కొన్నారు. చేతిలో ఉద్యోగ నియామక పత్రాలు ఉన్నప్పటికీ, అవసరమైన విద్యా సర్టిఫికెట్లు సమర్పించలేక యువత తమ ప్రతిభతో సాధించిన ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు బంగారం తాకట్టు పెట్టడం, అప్పులు చేయడం ద్వారా కళాశాల ఫీజులు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య రాష్ట్రంలోని ఇంజనీరింగ్, డిగ్రీ సహా ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల కుటుంబాలకు తీవ్రమైన సమస్యగా మారిందని పేర్కొన్నారు.గత కొన్నేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో అనేక కళాశాలలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని, అధ్యాపకులు, సిబ్బందికి జీతాలు చెల్లించడంలో కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయని యశస్వి మల్క తెలిపారు. ఈ పరిస్థితికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ బాధ్యత వహించాలని ఆయన విమర్శించారు.గతంలో కేటీఆర్, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. రెండు లక్షల ఉద్యోగాలు, 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలను అమలు చేయకుండా విద్యార్థులను, యువతను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రామచందర్ రావు గారు చేపడుతున్న రెండు రోజుల నిరాహార దీక్షకు విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వాలని యశస్వి మల్క పిలుపునిచ్చారు.అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా సేకరించిన సంతకాల ప్రతులతో ఢిల్లీకి వెళ్లి, కాంగ్రెస్ అగ్రనేత శ్రీ రాహుల్ గాంధీ నివాసం ఎదుట బీజేవైఎం, బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడతామని ఆయన హెచ్చరించారు.విద్యార్థుల ఖాతాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు జమ అయ్యే వరకు, బకాయిలు పూర్తిగా విడుదలయ్యే వరకు ఈ పోరాటం ఆగదని యశస్వి మల్క స్పష్టం చేశారు.

WWW.NETIDARSHINI.COM
RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక

# బిజినెస్

## నష్టాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు




ముంబై

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం నష్టాలతో ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు రావడంతో పాటు పలు కీలక రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించడంతో సూచీలు ప్రారంభ సెషన్‌లోనే క్షీణించాయి. ఉదయం ట్రేడింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే నిఫ్టీ 72 పాయింట్లు తగ్గి 24,146 వద్దకు చేరింది. మరోవైపు సెన్సెక్స్ 148 పాయింట్లు క్షీణించి 77,220 వద్ద ట్రేడవుతోంది. దీంతో మార్కెట్‌లో ఇన్వెస్టర్లలో అప్రమత్తత కనిపించింది. నిఫ్టీ 50 ఇండెక్స్‌లో సిప్లా, హిందాల్కో ఇండస్ట్రీస్, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ షేర్లు టాప్ లూజర్స్‌గా నిలిచాయి. ఈ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి ఎక్కువగా కనిపించింది. విస్తృత మార్కెట్‌లోనూ స్వల్ప నష్టాలే నమోదయ్యాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.02 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.06 శాతం చొప్పున తగ్గాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ మెటల్, నిఫ్టీ ఆటో సూచీలు అత్యధికంగా నష్టపోయాయి. మరోవైపు నిఫ్టీ ఐటీ, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు లాభాల్లో కొనసాగాయి. దీంతో మార్కెట్‌లో రంగాల వారీగా భిన్నమైన ట్రెండ్ కనిపించింది. మార్కెట్ ప్రారంభంలో నష్టాలు నమోదైనప్పటికీ, తదుపరి సెషన్లలో సూచీలు ఏ దిశగా కదులుతాయన్నది కీలకంగా మారింది. అంతర్జాతీయ మార్కెట్ల పరిణామాలు, విదేశీ పెట్టుబడిదారుల పెట్టుబడులు, రూపాయి మారకం విలువ, ముడిచమురు ధరలు తదితర అంశాలు దేశీయ మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇన్వెస్టర్లు ప్రస్తుతం కీలక స్టాక్స్ కదలికలను నిశితంగా గమనిస్తున్నారు.

## హైదరాబాద్‌లో స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

హైదరాబాద్:

బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు మంగళవారం స్వల్పంగా తగ్గాయి. భారీ స్థాయిలో కొనసాగుతున్న పసిడి ధరల్లో కాస్త తగ్గుదల కనిపించడంతో కొనుగోలుదారులకు కొంత ఊరట లభించింది. హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.220 తగ్గి రూ.1,63,750కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.200 తగ్గి రూ.1,50,100గా నమోదైంది. బంగారం ధరల్లో రోజువారీ హెచ్చుతగ్గులకు అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు, అమెరికా డాలర్ విలువ, రూపాయి మారకం రేటు, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, దేశీయ డిమాండ్ వంటి పలు అంశాలు కారణమవుతాయి. ఈ పరిణామాల నేపథ్యంలో మంగళవారం ధరల్లో స్వల్ప తగ్గుదల చోటుచేసుకుంది. 24 క్యారెట్ల బంగారం స్వచ్ఛత ఎక్కువగా ఉండటంతో ధర కూడా 22 క్యారెట్లతో పోలిస్తే ఎక్కువగా ఉంటుంది. 22 క్యారెట్ల




బంగారాన్ని ఆభరణాల తయారీలో ఎక్కువగా ఉపయోగిస్తారు. పెళ్లిళ్లు, శుభకార్యాలు, పండుగల నేపథ్యంలో బంగారానికి డిమాండ్ కొనసాగుతున్నప్పటికీ, అధిక ధరల కారణంగా కొనుగోలుదారులు మార్కెట్ కదలికలను గమనిస్తున్నారు. ఇక ఆభరణాల కొనుగోలు సమయంలో బంగారం ధరతోపాటు మేకింగ్ ఛార్జీలు, జీఎస్టీ తదితర అదనపు ఖర్చులు ఉండే అవకాశం ఉంది. అందువల్ల బులియన్ మార్కెట్‌లో ప్రకటించే ధర, ఆభరణాల దుకాణంలో చెల్లించే తుది ధర మధ్య వ్యత్యాసం ఉండొచ్చు. కొనుగోలు చేసేవారు బంగారం స్వచ్ఛత, హాల్‌మార్క్, మేకింగ్ ఛార్జీలను పరిశీలించడం మంచిది. తెలుగు రాష్ట్రాల్లో నగరాన్ని బట్టి బంగారం ధరల్లో స్వల్ప తేడాలు ఉండే అవకాశం ఉంది. స్థానిక మార్కెట్ పరిస్థితులు, డిమాండ్, ఆభరణాల దుకాణాల ఛార్జీలను బట్టి ధరల్లో మార్పులు కనిపించవచ్చు. రానున్న రోజుల్లో అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు, పెట్టుబడిదారుల ఆసక్తి, దేశీయ డిమాండ్‌ను బట్టి పసిడి ధరల్లో మళ్లీ మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

## సామాన్యులకు షాక్.. భారీగా పెరిగిన చక్కెర ధర

హైదరాబాద్:

దేశవ్యాప్తంగా చక్కెర ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. గతంలో కిలో చక్కెర ధర రూ.50లోపే ఉండగా.. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో రూ.75 నుంచి రూ.80 వరకు చేరింది. ఒక్కసారిగా పెరిగిన ధరలతో సామాన్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యావసర సరుకుల్లో కీలకమైన చక్కెర ధర పెరగడంతో కుటుంబాల నెలవారీ బడ్జెట్‌పై అదనపు భారం పడుతోంది. చక్కెర ధరలు పెరగడానికి పలు కారణాలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో చక్కెరకు కొరత ఏర్పడటం, దేశీయంగా పండుగల సీజన్‌లో డిమాండ్ పెరగడం, కొన్ని ప్రాంతాల్లో కృత్రిమ కొరత సృష్టించడం వంటి అంశాలు ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయని పేర్కొంటోంది. డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేకపోవడంతో మార్కెట్‌లో ధరలు పైకి కదులుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు పెట్రోల్‌లో కలిపే ఇథనాల్



ఉత్పత్తి కూడా చక్కెర ధరలపై ప్రభావం చూపుతోందని మార్కెట్ నిపుణులు అంటున్నారు. చెరకు నుంచి చక్కెరతోపాటు ఇథనాల్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ఇథనాల్‌కు డిమాండ్ పెరగడంతో చెరకు వినియోగంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ఇది చక్కెర లభ్యతపై ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. చక్కెర ధరల పెరుగుదల కేవలం గృహ వినియోగదారులపైనే కాకుండా స్వీట్లు, బేకరీ ఉత్పత్తులు, పానీయాలు, హోటళ్లు, రెస్టారెంట్లపై కూడా ప్రభావం చూపుతోంది. ముడిసరుకు ధర పెరగడంతో ఆయా ఉత్పత్తుల తయారీ ఖర్చులు పెరుగుతున్నాయి. దీంతో రానున్న రోజుల్లో స్వీట్లు, బిస్కెట్లు, ఇతర చక్కెర ఆధారిత ఉత్పత్తుల ధరలపైనా ప్రభావం పడే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో చక్కెర ధరలు కూడా భారీగా పెరగడం సామాన్యులకు మరింత భారంగా మారింది. ధరల నియంత్రణకు సరఫరాను పెంచడంతోపాటు మార్కెట్‌లో కృత్రిమ కొరతకు అడ్డుకట్ట వేయాలని వినియోగదారులు కోరుతున్నారు. రానున్న రోజుల్లో సరఫరా పరిస్థితులు, డిమాండ్, అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలను బట్టి చక్కెర ధరల్లో మార్పులు ఉండే అవకాశం ఉంది.

# స్పోర్ట్స్

### కొలంబో టెస్టులో శ్రీలంక పోరాటం..

## మూడో రోజు 6 వికెట్లే తీసిన భారత బౌలర్లు..!

**కొలంబో టెస్టులో పోరాడుతున్న లంక బ్యాటర్లు**

**మూడో రోజు 6 వికెట్లు తీసిన భారత బౌలర్లు**

**ఆట ముగిసే సమయానికి శ్రీలంక స్కోరు 265/8**

కొలంబో వేదికగా భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టులో ఆతిథ్య శ్రీలంక పోరాడుతోంది. రెండో రోజు ఆటలో 3 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయిన ఆ జట్టు.. మూడో రోజు ధీటుగా బదులిచ్చింది. 257 పరుగులు చేసిన ఆ జట్టు 6 వికెట్లు మాత్రమే కోల్పోయింది. ప్రస్తుతం ఆ జట్టు 265/8తో ఉంది. ఇంకా 238 పరుగులు వెనుకబడి ఉంది. క్రీజులో సోనాల్ దినుష (85), లాహిరు కుమార (8) ఉన్నారు. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా.. 503/9 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. రెండో రోజు మూడు ఓవర్లు మాత్రమే బ్యాటింగ్ చేసిన శ్రీలంక.. 8/2తో ఆటను ముగించింది. ఓవర్ నైట్ స్కోరు 8/2తో మూడో రోజు ఆట ప్రారంభించిన శ్రీలంకకు ఆదిలోనే షాక్ తగలింది. నైట్‌వాచ్‌మన్‌గా వచ్చిన కమిల్ మిషారా (19)ను ప్రసిద్ధ్ కృష్ణ ఔట్ చేసి దెబ్బకొట్టాడు. ఆ తర్వాత కామిందు మెండిస్ (32) కూడా ప్రసిద్ధ్ బౌలింగ్‌లోనే జడేజాకు క్యాచ్ ఇచ్చి నిష్క్రమించగా, కెప్టెన్ ధనంజయ డి సిల్వా (8)ను




మానవ్ సుతార్ త్వరగానే పంపించి లంకను 137/5తో కష్టాల్లో పడేసాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా పసిందు సూరియబండార పట్టుదలతో బ్యాటింగ్ చేసి 133 బంతుల్లో 9 ఫోర్లతో 80 పరుగులు సాధించాడు. అతనికి సోనాల్ దినూష చక్కటి సహకారం అందించాడు. ఈ జోడీ భారత బౌలర్లను విసుగెత్తిస్తూ లంక ఇన్నింగ్స్‌ను నిలబెట్టింది. రవీంద్ర జడేజా బౌలింగ్‌లో సూరియబండార (80) అవుటైన తర్వాత కూడా దినూష (137 బంతుల్లో 85 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్సర్లు) తన పోరాటాన్ని కొనసాగించాడు. టెయిలెండర్ల సాయంతో జట్టును ఆదుకున్నాడు. దీంతో మూడో రోజు ఆటను ఆ జట్టు 265/8 వద్ద ముగించింది. భారత బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ, మానవ్ సుతార్ అత్యధికంగా మూడేసి వికెట్లు పడగొట్టారు. మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజాలకు ఒక్కో వికెట్ దక్కింది. అరంగేట్ర స్పిన్నర్ సారాంశ్ జైన్.. 18 ఓవర్లు వేసినప్పటికీ ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. ఇక నాలుగో రోజు ఉదయమే మిగిలిన రెండు వికెట్లను త్వరగా పడగొట్టి, భారీ టార్గెట్ సెట్ చేయాలని భారత్ భావిస్తోంది.

### శ్రీలంక స్పిన్నర్‌పై ఐసీసీ కొరడా..

## డీమెరిట్ పాయింట్ విధింపు..!

కొలంబో టెస్టులో వరసగా ఆటగాళ్లు ఐసీసీ ఆగ్రహానికి గురవుతున్నారు. ఇప్పటికే భారత ఓపెనర్ యశస్వీ జైస్వాల్, లంక పేసర్ అసితా ఫెర్నాండోలకు మ్యాచ్ ఫీజులో కోత విధించిన ఐసీసీ.. ఈసారి ప్రభాత జయసూర్య పై కొరడా ఝులిపించింది. నియమావళిని ఉల్లంఘించినందుకు అతడికి ఒక డీమెరిట్ పాయింట్ కేటాయించింది అత్యున్నత క్రికెట్ మండలి. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో కీలకమైన టెస్టు సిరీస్‌లో శ్రీలంక మరో క్రికెటర్ ఐసీసీ నియమావళిని ఉల్లంఘించి.. శిక్షకు గురయ్యాడు. స్వదేశంలో భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టులో ప్రభాత జయసూర్య ఐసీసీ ఆర్టికల్ 2.2 కోడ్‌ను ఉల్లంఘించాడు. రెండోరోజు టీమిండియా 503జ9 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన తర్వాత.. బ్యాటింగ్‌కు దిగిన లంక చూస్తుండగానే రెండు వికెట్లు కోల్పోయింది. మానవ్ సుతార్ ఓవర్లో ఔటైన ప్రభాత.. పెవిలియన్‌కు వెళ్తూ.. బౌండరీ లైన్ దగ్గరి వెడ్జెస్‌ను బ్యాటుతో కొట్టాడు. దాంతో.. అతడిపై ఐసీసీ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ క్రమశిక్షణ చర్యలు తీసుకున్నాడు. తన పొరపాటును లంక స్పిన్నర్ అంగీకరించాడు. గత 24 నెలల్లో ఇదే మొదటి తప్పిదం కావడంతో అతడిని



క్షమాపణలు, ఒక డీమెరిట్ పాయింట్‌తో వదిలేసింది ఐసీసీ. ఇదే టెస్టులో.. తొలి రోజు మైదానంలో గొడవపడినందుకు భారత ఓపెనర్ యశస్వీ జైస్వాల్, లంక పేసర్ అసితా ఫెర్నాండోలు 25 శాతం మ్యాచ్ ఫీజు కోల్పోయారు. అంతేకాదు చెరొక డీ మెరిట్ పాయింట్ విధించింది ఐసీసీ.

## టెస్టుల్లో జడ్డూ చెత్త రికార్డు.. 22 డీఆర్ఎస్‌లు వృథా..!



భారత ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా టెస్టుల్లో మాత్రం చెత్త రికార్డు కొనసాగిస్తున్నాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో గణాంకాల పరంగా మెరుగ్గానే ఉన్నప్పటికీ.. డీఆర్ఎస్(అంపైర్ నిర్ణయాన్ని సమీక్షించడం)లో మాత్రం జడ్డూ తేలిపోతున్నాడు. ఇప్పటివరకూ అతడు వరుసగా 22 రివ్యూలను కోల్పోయాడు. వీటిలో నాలుగు దఫాలు మాత్రమే అంపైర్ కాల్‌గా వెళ్లాయి. సుదీర్ఘ ఫార్మాట్‌లో దిగ్గజ ఆల్‌రౌండరైన రవీంద్ర జడేజా రివ్యూల్లో మాత్రం విఫలమవుతున్నాడు. ఈమధ్య జడ్డూ 22 డీఆర్ఎస్‌లు తీసుకోగా.. 18 రివ్యూలు వృథా అయ్యాయి. నాలుగుసార్లు మాత్రమే అంపైర్ కాల్ తీసుకున్నారు. దాంతో.. ఇన్నేసి రివ్యూలు కోల్పోయిన ఆల్‌రౌండర్‌గా జడేజా చెత్త రికార్డు మూటగట్టుకున్నాడు. చివరిసారిగా 2023లో జడేజా తీసుకున్న రివ్యూ విజయవంతమైంది. ఆ ఏడాది జూలైలో డొమినికా టెస్టులో వెస్టిండీస్‌పై తొలి ఇన్నింగ్స్‌లో రివ్యూతో కీమర్ రోచ్ వికెట్ సాధించాడీ స్పిన్నర్. ఇప్పటివరకూ టెస్టుల్లో 15సార్లు ఐదువికెట్లు, మూడు దఫాలు పది వికెట్లతో కలిపి.. మొత్తంగా 352 వికెట్లు తీశాడీ వెటరన్. అతడి అత్యుత్తమ ప్రదర్శన 7జ42.



## చీరకట్టులో శృతిమించిన హెబ్బా పటేల్ గ్లామర్

# అక్షయ్ కుమార్, సైఫ్ అలీ ఖాన్ 'హైవాన్' ట్రైలర్ రిలీజ్.. విలన్‌గా అక్షయ్!





బాలీవుడ్ స్టార్ హీరోలు అక్షయ్ కుమార్, సైఫ్ అలీ ఖాన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా సైకలాజికల్ క్రైమ్ థ్రిల్లర్ 'హైవాన్'. ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఈ చిత్రంలో అక్షయ్ కుమార్ విలన్‌గా కనిపించబోతుండగా, సైఫ్ అలీ ఖాన్ అంధుడి పాత్రలో నటిస్తున్నాడు. అక్షయ్ ఒక వైపు అంధుడైన సైఫ్‌ను వేటాడే తీరు, వీరిద్దరి మధ్య సాగే ఉత్కంఠభరితమైన పిల్లి-ఎలుకల ఆట ప్రేక్షకులను కట్టిపడేసేలా ఉంది. ఈ చిత్రంలో బొమన్ ఇరానీ జడ్జిగా, సయామి ఖేర్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. శ్రియా పిగ్లోంకర్, షరీబ్ హష్మి ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ మరియు దిస్పియన్ ఫిలింస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ హై-వోల్టేజ్ యాక్షన్ సస్పెన్స్ డ్రామాను ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 11, 2026 న థియేటర్లలో విడుదల చేయనున్నారు.

# బికినీలో కృతిసనన్ రక్షాబంధన్ సెలబ్రేషన్స్

### ఏకి పడేసిన నటి, ఎంపి కంగనా రనౌత్

కృతి సనన్ ఇటీవల నటించిన ఓ యాడ్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఇప్పటికే నెట్టింట విమర్శలు రాగా.. బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్ తాజాగా మండిపడ్డారు. రక్షా బంధన్ అంటే ప్రతి సోదరికీ ఎంతో ప్రత్యేకమైన రోజు. అంత గొప్ప సమయంలో హుందాగా కనిపించాలి. ఈ సాంప్రదాయ పండగకు సంబంధించిన ప్రకటనలో ఇలాంటి దుస్తులా ధరించేది. ఈ రోజుల్లో మహిళలకు లెహంగాలు, జీన్స్, సల్వార్ కమీజ్, చీరలు, పంజాబీ డ్రెస్‌లు.. ఇన్ని రకాలు ఉన్నాయి. ఇన్ని ఉన్నా.. ఇలాంటి బికినీ ధరించి రాఖీ ఎందుకు కడతారు?. ఈ యాడ్ చేసిన స్టైలిష్ట్‌కు ఈ ఆప్షన్లు కనిపించలేదా? ఈ యాడ్ ఉద్దేశపూర్వకంగా చేసినట్లుంది. చాలా అసహ్యంగా కనిపిస్తోందని తన ఇన్‌స్టాలో రాసుకొచ్చారు. ఇటీవల విడుదలైన ఈ యాడ్‌పై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా కృతిని ట్రోల్ చేస్తున్నారు. డ్రెస్‌తో పాటు.. ఈ యాడ్‌లో పెంపుడు కుక్కకు రాఖీ కడుతూ కృతి కనిపించడంతో విమర్శలు మరింత ఎక్కువయ్యాయి. ఈ యాడ్‌పై ఇప్పటి వరకూ యాజమాన్యం, కృతి సనన్ స్పందించలేదు.



# నేడు విడుదలవుతున్న టాక్సిక్

### -టిక్కెట్ రేట్ల పెంపునకు తెలంగాణలో అనుమతి




కన్నడ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్' ఆగస్టు 26 ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న తరుణంలో, తెలంగాణ ప్రభుత్వం సినిమా టికెట్ ధరలను పెంచుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు హోమ్ శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సింగిల్ స్క్రీన్ థియేటర్లలో జీఎస్టీతో కలుపుకుని రూ. 50, అలాగే మల్టీప్లెక్స్‌లు మరియు స్పెషల్ థియేటర్లలో రూ. 100 వరకు అదనంగా టికెట్ ధరలను పెంచుకోవడానికి అనుమతిని ఇచ్చారు. పెంచిన ధరలు సినిమా విడుదలైన రోజు నుంచి సెప్టెంబర్ 4 వరకు పది రోజుల పాటు అమలులో ఉంటాయి. అలాగే ఈ పది రోజుల పాటు రోజుకు అదనంగా ఒక షోతో కలుపుకుని మొత్తం 5 షోలు ప్రదర్శించుకోవడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ధరల పెంపుతో పాటు మరికొన్ని కీలక నిబంధనలను కూడా ఖరారు చేసింది. సినీ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అకౌంట్‌కు నిర్మాణ సంస్థ 'కేవీఎన్-మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ ఎల్ఎల్‌పీ' తక్షణమే రూ. 1 కోటి విరాళంగా అందించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిధులను పూర్తిగా సినీ కార్మికుల సంక్షేమం కోసం మాత్రమే ఖర్చు చేయనున్నారు. అలాగే, సినిమా ప్రదర్శన సమయంలో మాదకద్రవ్యాలు, నార్కోటిక్స్ మరియు సైబర్ క్రైమ్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించే ప్రత్యేక ప్రకటనలను తప్పనిసరిగా ప్రదర్శించాలని థియేటర్ల యాజమాన్యాలను ప్రభుత్వం ఆదేశించింది. ఈ నిబంధనలన్నీ ఎలాంటి లోపాలు లేకుండా కచ్చితంగా అమలయ్యేలా పర్యవేక్షించే బాధ్యతను జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు మరియు సినిమా లైసెన్సింగ్ అధికారులకు అప్పగించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శిఖా గోయల్ ఈ మేరకు అధికారిక ఉత్తర్వులను జారీ చేశారు. టాక్సిక్' చిత్రాన్ని తెలంగాణలో ప్రముఖ నిర్మాత, పంపిణీ దారుడు, ఎఫ్.డి.సి. ఛైర్మన్ దిల్ రాజు విడుదల చేస్తున్నారు.

# దేశ విభజన నేపథ్యంలో బట్వారా 1947

### పేలవ ప్రదర్శనతో ఆకట్టులోకపోయిన చిత్రం....




సన్నీ డియోల్ హీరోగా దేశ విభజన గాథ నేపథ్యంలో ఆమిర్ ఖాన్ నిర్మించిన 'బట్వారా 1947' చిత్రం ఆగస్ట్ 14న విడుదలైంది. ఈ సినిమా బాక్సాఫీస్ బరిలో చాలా పేలవమైన ప్రభావాన్ని చూపించింది. దీనికి ముందు ఇదే తరహాలో వచ్చిన 'మై వాపస్ ఆవుంగా' దీనికంటే బెటర్ గా పెర్ఫార్మ్ చేసిందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. 'బట్వారా' చిత్రంతో ఆమిర్ ఖాన్‌కు దాదాపు 90 కోట్ల నష్టం వచ్చిందని అంచనా వేస్తున్నారు. అయితే ఇప్పుడీ సినిమా ఓటీటీ డీల్ సందిగ్ధంలో పడింది. నిజానికి సినిమా రిలీజ్ కు ముందు ఓ ప్రముఖ ఓటీటీ సంస్థ రూ. 125 కోట్లను ఆఫర్ చేసిందట. కానీ అప్పుడు అందుకు ఆమిర్ ఖాన్ అంగీకరించలేదని తెలిసింది. ఇప్పుడు సినిమా విడుదలై పరాజయం పాలు కావడంతో ఏ ఓటీటీ ప్లాట్ ఫామ్ కూడా దీని హక్కులపై ఆసక్తి చూపడం లేదట. 'బట్వారా' సినిమా విడుదలకు ముందే ఓటీటీ డీల్ కుదర్చుకోమని, ఆ కారణంగా ఆర్థికంగా ఉపయోగపడుతుందని ఆమిర్‌కు సన్నీడియోల్ చెప్పినట్టు వార్తలు వచ్చాయి. అయితే ఆయన దానిని ఖండించారు. తమ మధ్య ఓటీటీ డీల్‌కు సంబంధించి ఎలాంటి చర్చ జరగలేదని ఆయన అన్నారు. 'బట్వారా' సినిమా విషయంలో తాను గర్వం పడుతుంటానని, బాక్సాఫీస్ ఫలితాలు సినిమా క్వాలిటీని ప్రతిఫలించవని ఆయన తెలిపారు. తన తండ్రి కెరీర్ లో హృషికేశ్ ముఖర్జీ తీసిన 'సత్యకామ్' ఉత్తమ చిత్రంగా తాను భావిస్తానని, కాని ఆ సినిమా బాక్సాఫీస్ దగ్గర భారీ పరాజయాన్ని చవిచూసిందని సన్నీ డియోల్ చెప్పారు. అయితే 'బట్వారా' నష్టాలు రాబోయే రోజుల్లో భర్తీ అవుతాయనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365